


# జాక్ లండన్ కథలు

అనువాదం  బి.సుభాష్ బాబు, వి.విజయకుమార్



డా॥ చెలికాని రామారావు మెమోరియల్ కమిటీ



JACK LONDON KATHALU

*Translated by* B. Subhash Babu
V. Vijaya Kumar

జగమెరిగిన గొప్ప కథకుడు జాక్ లండన్. ఆయన రాసిన రెండు కథల అనువాదాలీ చిరు పుస్తకం.

మొదటి కథను శ్రీ బి. సుభాష్ బాబు 'ముసలాళ్ళ జట్టు' పేరుతో అనువదించారు. ఈ కథలో జాక్ లండన్ 'అభివృద్ధి' అనేది అందరి అభివృద్ధి కానక్కర్లేదనే గొప్ప సత్యాన్ని మనకు తెలియచేస్తాడు. పెట్టుబడిదారీ అభివృద్ధి క్రమంలో జరిగే 'అభివృద్ధి' వెనుకబడిన వర్గాలు, ప్రజా బృందాలకు ఎలా నష్టంచేసి నాశనం చేస్తుందో గొప్పగా వెల్లడించాడు.

శ్రీ వి. విజయకుమార్ అనువదించిన 'నిప్పు రాజేయడం కోసం' మరొక మౌలిక సత్యాన్ని తెలుపుతుంది. మానవులు సమిష్టిగా కృషి చేసి మాత్రమే ప్రకృతిని తనకు అవసరమైన విధంగా మార్చగలిగారనేది మార్క్స్ చెప్పిన సత్యం. సమిష్టి భావన లేని ఒక వ్యక్తి భయంకరమైన అంధ ప్రకృతి శక్తి క్షేత్రంలో ఒంటరిగా ప్రవేశించి చేసిన పోరాటాన్ని అత్యద్భుతంగా చిత్రించాడు జాక్ లండన్.

చక్కని అనువాదాలు.. చదివి చూడండి.

వెల : ₹10/-

డా॥ చెలికాని రామారావు మెమోరియల్ కమిటీ

రామచంద్రపురం - 533 255

# జాక్ లండన్ కథలు

అనువాదం

**బి. సుభాష్ బాబు, వి. విజయకుమార్**



**డా॥ చెలికాని రామారావుగారు**

**15.7.1901-25.9.1985**

చెలికాని రామారావు మెమోరియల్ కమిటీ
రామచంద్రపురం

JACK LONDON KATHALU

ప్రచురణ సంఖ్య : 10

ప్రథమ ముద్రణ : ఆగస్టు, 2021

ప్రతులు : 1000

టైటిల్ : గిరిధర్

© **రిజర్వ్‌డ్**

**వెల : 10/-**

ప్రచురణ :
**డా. చెలికాని రామారావు మెమోరియల్ కమిటీ**
రామచంద్రపురం– 533 255
తూర్పు గోదావరి జిల్లా

ప్రతులకు :
**విశాలాంధ్ర బుక్ హౌస్ :** విజయవాడ, విశాఖపట్నం
అనంతపురం, గుంటూరు, తిరుపతి, కాకినాడ, ఒంగోలు
శ్రీకాకుళం, కడప, విజయనగరం

ముద్రణ :
**విశాలాంధ్ర విజ్ఞాన సమితి**
విజయవాడ

# ముందుమాట

**వా**మపక్ష భావాలను, ప్రజోపయోగకరమైన సాహిత్యాన్ని పాఠకులకు అందించేందుకు డా॥ చెలికాని రామారావు మెమోరియల్ కమిటీ కృషిచేస్తున్నది. ఆ కృషిలో భాగంగా ప్రపంచ ప్రఖ్యాత రచయిత జాక్ లండన్ రాసిన రెండు కథలను అందిస్తున్నాం. ఈ రెండు కథలు మాకు తెలిసినంతలో ఇప్పటి వరకూ తెలుగులో రాలేదు. ఈ కథలను ఇద్దరు మిత్రులు చక్కగా అనువదించారు.

మొదటి కథను శ్రీ బి. సుభాష్ బాబు 'ముసలాళ్ళ జట్టు' పేరుతో అనువదించారు. ఈ కథలో జాక్ లండన్ 'అభివృద్ధి' అనేది అందరి అభివృద్ధి కానక్కర్లేదనే గొప్ప సత్యాన్ని మనకు తెలియచేస్తాడు. పెట్టుబడిదారీ అభివృద్ధి క్రమంలో జరిగే 'అభివృద్ధి' వెనుకబడిన వర్గాలు, ప్రజా బృందాలకు ఎలా నష్టంచేసి, నాశనం చేస్తుందో గొప్పగా వెల్లడించాడు. నేడు కూడా మనం ఈ విషయాన్ని గ్రహించకుండా 'అభివృద్ధి' మంత్రాన్ని గుడ్డిగా జపిస్తున్నాం.

ఇక శ్రీ వి. విజయకుమార్ అనువదించిన 'నిప్పు రాజేయడం కోసం' మరొక మౌలిక సత్యాన్ని తెలుపుతుంది. మానవులు సమిష్టిగా కృషి చేసి మాత్రమే ప్రకృతిని తనకు అవసరమైన విధంగా మార్చగలిగారనేది మార్క్స్ చెప్పిన సత్యం. సమిష్టి భావన లేని ఒక వ్యక్తి భయంకరమైన అంధ ప్రకృతి శక్తి క్షేత్రంలో ఒంటరిగా ప్రవేశించి అంతమైన విధానాన్ని అత్యద్భుతంగా చిత్రించాడు జాక్ లండన్. వ్యక్తివాదం తలకెక్కిన నేటి సమాజంలో సమాజం, సమిష్టి శ్రమల విలువను చెప్పకనే చెబుతుందీ కథ.

ఈ కథల ప్రచురణకు అంగీకరించిన అనువాదకులిరువురికీ డా॥ చెలికాని రామారావు మెమోరియల్ కమిటీ తరఫున కృతజ్ఞతలు.

మరొక ముఖ్య విషయాన్ని పాఠక మిత్రుల దృష్టికి తీసుకురావాలనుకుంటున్నాం. మంచి పుస్తకాలను మా చేతనైన మేరకు ప్రచురించి పాఠక మిత్రులకు ఉచితంగా అందించాలని కమిటీ ప్రగాఢ ఆకాంక్ష. కాని పంపిణీలో కొన్ని ఇబ్బందులు మా ఆశయం పూర్తిగా సఫలం కాకుండా అడ్డుపడుతున్నాయి. మా ప్రచురణలు వీలైనంత ఎక్కువ మందికి అందాలనే సత్సంకల్పంతో నామమాత్రపు ధరను నిర్ణయించాం. మిత్రులు అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నాం.

**చెలికాని స్టాలిన్**

**అధ్యక్షులు**

**డా॥ చెలికాని రామారావు మెమోరియల్ కమిటీ**

**రామచంద్రపురం, తూర్పు గోదావరి జిల్లా**

**ఫోన్ : 98493 48162**

# ముసలాళ్ళ జట్టు

మూలం : **జాక్ లండన్ కథల సంకలనమైన చిల్డ్రన్ ఆఫ్ ఫ్రాస్ట్ (1902) లోని**

**'ది లీగ్ ఆఫ్ ఓల్డ్ మెన్' అనే కథ**

అనువాదం : **బి. సుభాష్ బాబు**

**బ్యారక్స్**లో ఓ వ్యక్తి మరణ దండన విచారణని ఎదుర్కొంటున్నాడు. అతనో ముసలివాడు. లేబర్జ్ సరస్సు దిగువ యూకాన్ నదిలోకి పారే వైట్ ఫిష్ నదీ ప్రాంతానికి చెందిన వాడతను. డాసన్ ప్రాంతమంతా, అలాగే వెయ్యి మైళ్ళు ఎగువకి, దిగువకి ఉన్న యూకాన్ వాసులలో ఈ విషయం ఎంతో ఆందోళన రేకెత్తిస్తోంది. భూమిపై, సముద్రంపై నిత్యం దోపిడీలు చేసే ఈ ఆంగ్లో–శాక్సన్ జాతివాళ్ళు తమ చేతిలో ఓడినవాళ్ళపై చట్టాన్ని ప్రయోగించడం పరిపాటే! తరచుగా ఈ చట్టం కఠినంగా ఉంటుంది. కానీ ఇంబర్ విషయానికి వచ్చేసరికి ఈ చట్టం ఒకింత అల్పంగానూ, బలహీనంగానూ కనిపిస్తోంది. లెక్కలేసుకునే ధోరణిలో చూస్తే, అతడికి పడే శిక్షలో సమన్యాయ భావన వుండేటట్టుగా లేదు. శిక్ష అప్పటికే నిశ్చయమైపోయింది. అందులో సందేహం లేదు. అది మరణ శిక్షయినా కూడా ఇంబర్‌కి ఉన్నది మాత్రం ఒక్కటే ప్రాణమైపోయింది. కానీ అతడికి వ్యతిరేకంగా లెక్కలేనన్ని ఆరోపణలున్నాయి.

నిజానికి అతడి చేతులు ఎంతోమంది నెత్తురుతో తడిచాయి. ఆ హత్యలకు కచ్చితమైన లెక్కలేదు. అతని చేతిలో హతమైన వారి సంఖ్య విషయమై, కాలక్షేపానికి దారిప్రక్కన పొగ త్రాగుతూ, మంట దగ్గర చలికాగుతూ, చాలామంది అనేక అస్పష్ట అంచనాలు వేశారు. హతులంతా తెల్లవాళ్ళే! వాళ్ళంతా ఒంటరిగా, జంటలుగా, గుంపులుగా హతమయ్యారు. ఎంతో క్రూరమైన, నిర్హేతుకమైన ఈ అమాయకుల హత్యలు అక్కడి పహారా పోలీసులకు, అలాగే ఆ తరువాతి కాలంలో వచ్చిన సైనికాధికారులకు, ఆ తరువాత ఆ ప్రాంతం వాళ్ళ చేజిక్కినాక దాని అభివృద్ధి పేరున డొమినియన్ నుంచొచ్చిన గవర్నర్‌కూ అంతుచిక్కని రహస్యాలుగా ఉండిపోయాయి.

ఇప్పుడు అంతకంటే అంతుచిక్కని విషయం ఏమిటంటే, ఇంబర్ డాసన్‌కి వచ్చి,

తనకు తానుగా లొంగిపోవడం. ఆ వసంత ఋతువు చివరి రోజుల్లో, యూకాన్ నది తన మంచు క్రింద మంద్రంగా ఉరుముతూ, సుళ్ళుతిరుగుతూ ప్రవహిస్తున్న సమయంలో, ఒకరోజు ఈ ఇండియన్ జాతి ముసలాడు ఎంతో ప్రయాసతో, నది నుండి ఒడ్డుపైకి ఎగప్రాకి, ఎదురుగా ఉన్న పెద్ద వీధివైపు చూస్తూ నిలబడ్డాడు. ఆ సమయంలో అతని, రాకని చూసినవారు, అతడు బలహీనంగా తూలుతూ ఉండడం గమనించారు. అలా అతడు తూలుతూ వచ్చి ఒక కలప దుంగల గుట్టపై కూలబడ్డాడు. ఎడతెగని ప్రవాహంలా వస్తున్న తెల్లవాళ్ళను చూస్తూ, అతడు ఆ పొద్దంతా అక్కడే గడిపాడు. చాలామంది రెప్ప వాల్చకుండా చూస్తున్న అతనివంక తిరిగి చూశారు. ముఖంపై ఏదో వింతైన చూపుతో ఉన్న ఆ సివాష్ తెగ ముసలాణ్ణి చూసి కొందరు ఆశ్చర్యం ప్రకటించుకుంటూ, ఏదో తమలో తామే అనుకుంటూ ముందుకెళ్ళిపోతున్నారు. అలా అతన్ని గమనిస్తూ ముందు కెళ్ళిపోయిన తర్వాత చాలామంది తామొక అసాధారణ మానవాకృతి తాలూకూ జ్ఞాపకాన్నో, ఆ తరవాత అదే విషయాన్ని ఎప్పటికీ గుర్తుంచుకొనేలా చేసిన తమ చురుకైన గ్రాహ్యశక్తిని తలుచుకునో గర్వపడతారన్న దాఖలా ఏమీలేదు.

అయితే ఆ సందర్భం పొట్టి డికెన్సన్‌కి తన వీరత్వాన్ని ప్రదర్శించే అవకాశాన్నిచ్చింది. పొట్టి డికెన్సన్ గొప్ప కలలతో, జేబునిండా డబ్బుతో ఆ ప్రాంతానికి వచ్చాడు. కానీ పాపం ఆ డబ్బుతో పాటే కలలు కూడా కరిగిపోవడంతో, అమెరికాకు తిరిగి పోవడానికి కావలసిన డబ్బులు సంపాదించడానికి హోల్బ్రూక్ అండ్ మాసన్ అనే దళారీ సంస్థలో గుమాస్తాగిరికి కుదురుకున్నాడు. హోల్బ్రూక్ అండ్ మాసన్ కార్యాలయానికి ఎదురుగా ఉన్న దారికి అవతల ఇంబర్ కూర్చున్న దుంగల గుట్ట ఉంది. డికెన్సన్ భోజన విరామానికి వెళ్ళే ముందు అక్కడి కిటికీ నుండి బయట ఉన్న ఇంబర్‌ని చూశాడు. అతడు భోజనానికి వెళ్ళి వచ్చాక కూడా ఆ సివాష్ తెగ ముసలాడు ఇంకా అక్కడే ఉండడం గమనించాడు.

డికెన్సన్ కిటికీ నుండి బయటకు చూస్తూనే ఉన్నాడు. తరువాత అతడు కూడా చాలా సేపటివరకు చురుకైన గ్రాహక శక్తిని తలుచుకుని మురిసిపోయాడు. అతనొక రసికుడైన పొట్టివాడు. అతడు దండెత్తే సేనల్లా వస్తున్న తెల్లవాళ్ళపైనే నిశ్చలంగా ఉన్న ఆ అనాగరిక ముసలాడి చూపుని, సివాష్ తెగ యొక్క ప్రత్యేక లక్షణంగా పరిగణించాడు. గంటలు గడిచాయి. కానీ ఇంబర్ భంగిమలో ఏ మార్పూ లేదు. ఒక్క కండరాన్ని కూడా వెంట్రుకవాసైనా కదపలేదు. అది గమనించిన డికెన్సన్‌కి ఒక సంఘటన జ్ఞాపకం వచ్చింది. ఒక రోజు జనంతో కిటకిటలాడే ఒక పెద్ద వీధి మధ్యలో స్లెడ్జ్ (కుక్కలు లాగే జారుడు బండి)పై ఒకడు నిట్టనిలువుగా కూర్చుని ఉన్నాడు. అంతా ఆ మనిషి విశ్రాంతి తీసుకుంటున్నాడని భ్రమపడ్డారు. కానీ తరువాత అతణ్ణి తాకి చూస్తే, నడివీధిలో

గడ్డకట్టుకుపోయి మరణించడానికి సిద్ధంగా ఉన్నాడు. వెంటనే అంతా కలసి, అతణ్ణి ఒక మంట దగ్గరకు ఈడ్చుకుపోయి వెచ్చబెట్టాల్సి వచ్చింది. ఆ జ్ఞాపకంతో డికెన్సన్ వణికాడు.

తరువాత డికెన్సన్ వీధిలోకి వెళ్లి, సేదతీరడానికి ఒక చుట్టని వెలిగించాడు. కొద్దిసేపటి తరవాత అతడికి ఎమిలీ ట్రావిస్ తారసపడింది. ఆమె కోమలమైన సుకుమారి, అరుదైన సౌందర్యరాశి. ఒక సంపన్న గనుల అధికారి కూతురు. దానికి తగినట్లుగా లండన్లో ఉన్నా, క్లోనైడ్‌కోలో ఉన్నా ఆమె వస్త్రధారణ తన అంతస్తుని సూచించేలా ఉంటుంది. పొట్టి డికెన్సన్ తన చుట్టను తిరిగి తీసుకునేందుకు వీలుగా ఒక కిటికీ అంచులో ఉంచి, తన టోపీని పైకెత్తి ఆమెను పలకరించాడు.

అలా వారి సంభాషణ మొదలై సుమారు పది నిముషాలు కావొస్తుండగా, ఎమిలీ ట్రావిస్ డికెన్సన్ భుజం వెనుక చూస్తూ ఉలిక్కిపడి చిన్న కేక వేసింది. డికెన్సన్ వెనక్కి తిరిగి చూసి, తనూ గతుక్కుమన్నాడు. వీధిని అడ్డంగా దాటి వచ్చిన ఇంబర్ అక్కడ నిలబడి ఉన్నాడు. చిక్కి, శల్యమై ఆకలితో, నీడలా ఉన్న ఆకారం. అతడి చూపు ఆ అమ్మాయిపైనే నిలిచిపోయింది.

“ఏం కావాలి నీకు?” వణుకుతూనే లేని ధైర్యాన్ని నటిస్తూ డికెన్సన్ అతడిని ప్రశ్నించాడు.

ఇంబర్ చిన్నగా గద్దిస్తూ ఆమెవైపు కదిలాడు. ఆమెని అంగుళం, అంగుళం చాలా తీక్షణంగా, జాగ్రత్తగా పరిశీలించాడు. ప్రత్యేకించి, ఆమె మెత్తటి గోధుమ వర్ణపు కురులు, ఆమె బుగ్గలకు లేతగా అద్దబడిన రంగు అతడిలో ఆసక్తిని కలిగించాయి. అవి సీతాకోక చిలుక రెక్కల మాదిరిగా మృదువుగా ఉన్నాయి. కొలతలు కొలిచే కమ్మరివాడిలా, కళ్ళతో లెక్కలు వేస్తూ ఆమె చుట్టూ తిరిగాడు. ఇలా తిరిగే క్రమంలో, అతడి కంటి చూపుకీ, అస్తమించే సూర్యునికీ మధ్యగా ఆమె చెవిభాగం వచ్చింది. దాని గులాబీ రంగు పారదర్శకత అతణ్ణి ఆలోచనలో పడేసింది. తరువాత ఆమె నీలి రంగు కళ్ళలోకి దీర్ఘంగా, తీక్షణంగా చూశాడు. గద్దిస్తూ ఆమె చేతిని భుజానికీ, మోచేతికీ మధ్య గట్టిగా పట్టుకున్నాడు. ఇంకొక చేతితో ఆమె ముంజేతిని పట్టుకుని వెనక్కి మడిచాడు. అతడి ముఖంలో ఆశ్చర్యం, అసహనం ప్రత్యక్షమయ్యాయి. ఆమె చేతిని వదిలి, గద్దింపు స్వరంతో ఏదో సణిగాడు. తరువాత డికెన్సన్ వైపు తిరిగి అతనితో ఏదో మాట్లాడాడు.

అతని భాష డికెన్సన్‌కి అర్థం కావడంలేదు. దానికి ఎమిలీ నవ్వింది. ఇంబర్ అసహనంగా ఇద్దరినీ మార్చి మార్చి చూశాడు. వాళ్ళు తలలు అడ్డంగా ఆడించారు. ఇంబర్ అక్కడి నుండి నిష్క్రమించడానికి సిద్ధపడుతుండగా..

"ఓయ్, జిమ్మీ! ఇలా రా!" అని ఎమిలీ ఎవరినో పిలిచింది.

వీధికి ఆ చివర నుంచి జిమ్మీ వచ్చాడు. అతడు ఆంగ్లేయుల సంప్రదాయ వస్త్రధారణలో ఉన్న ఒక భారీకాయుడైన ఇండియన్ తెగవాడు. అతడు తలపై ఎల్డరాడో రాజుల మాదిరిగా ఒక పెద్ద టోపీ ధరించి ఉన్నాడు. అతడు ఇంబర్‌తో ఆగి, ఆగి గొంతుతో పొట్టి పొట్టి శబ్దాలు చేస్తూ మాట్లాడాడు. జిమ్మీ సిట్కాన్ తెగవాడు. అతనికి స్థానిక భాష యొక్క వివిధ యాసల మీద పట్టు అంతంతమాత్రమే!

"ఇతను వైట్ ఫిష్ తెగవాడు," జిమ్మీ ఎమిలీతో అన్నాడు. "నాతో ఎక్కువ మాట్లాడడట. తెల్లవాళ్ళ ముఖ్య నాయకుణ్ణి కలవాలంటున్నాడు."

"గవర్నర్!" డికెన్సన్ సలహా ఇచ్చాడు.

వైట్ ఫిష్ ముసలాడితో జిమ్మీ ఇంకా ఏదో మాట్లాడాడు. అతని ముఖం అయోమయంగా, ఆందోళనగా తయారైంది.

"ఇప్పుడు మనం కెప్టెన్ అలగ్జాండర్‌ని కలవాలేమో! వీడు తెల్లవాళ్ళను, వాళ్ళ ఆడవాళ్ళను, పిల్లలను చాలా మందిని చంపేశాడట. ఇప్పుడు వీడు చనిపోవాలనుకుంటున్నాడట" జిమ్మీ వివరించాడు.

"పిచ్చాడేమో!" డికెన్సన్ సందేహించాడు.

"ఏమంటున్నారు?" అడిగాడు జిమ్మీ.

డికెన్సన్ తన వేలుని తల వద్ద ఉంచి, వృత్తాకారంలో తిప్పుతూ సూచించాడు.

"అంతేనేమో, అంతేనేమో" అంటూ జిమ్మీ మళ్ళీ ఇంబర్ దగ్గరకు వచ్చాడు. అతడింకా తెల్లాళ్ళ నాయకుని కోసం పట్టుబడుతున్నాడు.

ఇంతలో అటుగా వెళుతున్న ఒక అశ్వదళ గస్తీ పోలీసు (ప్రస్తుతం గుర్రంమీద లేడు) ఆ గుంపు దగ్గర ఆగి, ఇంబర్ విషయం అడిగి తెలుసుకున్నాడు. అతడు బలిష్టమైన భుజాలతో, మందపాటి ఛాతీతో, చక్కటి ఆకృతితో ఎడంగా ఉన్న దృఢమైన కాళ్ళతో ఉన్న నవయువకుడు. ఇంబర్ కంటే చాలా ఎత్తున్నాడు. అతని కళ్ళు బూడిద వర్ణంలో, స్థిరంగా, నిర్మలంగా ఉన్నాయి. రక్తం నుండీ, సాంప్రదాయం నుండీ వచ్చిన శక్తి కలిగించిన ఆత్మవిశ్వాసం అతనిలో తొణికిసలాడుతోంది. పసితనపు ఛాయలు అతని పురుష లక్షణాలను మరింత దివ్యంగా ఆవిష్కరిస్తున్నాయి. అతను అప్పుడే యవ్వనంలో అడుగు పెడుతున్న యువకుడు. సిగ్గుపడుతున్న అందమైన కన్నెపిల్ల చెక్కిళ్ళలా అతడి బుగ్గలు గులాబీ రంగులో సున్నితంగా ఉన్నాయి.

ఇంబర్ వెంటనే అతని దగ్గరకు వచ్చాడు. అతని బుగ్గపై ఉన్న కత్తిగాటుని చూసిన ఇంబర్ కళ్ళు మెరిశాయి. ఇంబర్ వంగి తన బలహీనమైన చేతులతో ఉబికి ఉన్న ఆ

కుర్రాడి కాళ్ళ కండరాలను మెల్లగా వత్తి చూశాడు. విశాలమైన అతని ఛాతిని పిడికిలితో తట్టి చూశాడు. కవచాల మాదిరిగా అతని భుజాలను కప్పి ఉన్న దృఢమైన కండరాల్ని ఒత్తి, గుద్ది చూశాడు. ఇంతలో పొడవు కాళ్ళు, విశాల బాహువుల తెగ సంతతికి చెందిన గని కార్మికులూ, పర్వతాధిరోహకులు, సరిహద్దు ప్రజలు మొదలైనవారంతా ఆసక్తితో ఆ గుంపులో చేరారు. ఇంబర్ ఒక్కొక్కరినీ మార్చి మార్చి చూసి, వైట్ ఫిష్ భాషలో గట్టిగా మాట్లాడాడు.

"వాడేమన్నాడు?" ప్రశ్నించాడు డికెన్సన్.

"వాడేమంటున్నాడంటే, ఇక్కడున్నవాళ్ళంతా ఆ పోలీసులాగే, ఒకేలా, బలంగా ఉన్నారట" అనువదించాడు జిమ్మీ.

డికెన్సన్ పొట్టివాడు. ఎమిలీ ఉండగా ఆ ప్రశ్న వేసినందుకు తనని తానే తిట్టుకున్నాడు. ఆ పోలీసుకి ఇంబర్ పట్ల కాస్త సానుభూతి కలిగి "ఇతని కథలో నాకేదో ఉందనిపిస్తోంది. నేను ఇతణ్ణి విచారణకై కెప్టెన్ అలెగ్జాండర్ దగ్గరకు తీసుకెళతాను. జిమ్మీ, అతణ్ణి నాతో రమ్మని చెప్పు" అన్నాడు.

జిమ్మీ మరోసారి గొంతుతో వింత శబ్దాలు చేస్తూ ఇంబర్‌కి విషయాన్ని వివరించాడు. ఇంబర్ అంగీకరిస్తూ తృప్తిగా ఊకొట్టాడు.

"కానీ జిమ్మీ, ఇందాక అతను ఏం మాట్లాడాడో అడుగు. నా చేతిని ఎందుకు పట్టుకున్నాడో అడుగు" అంది ఎమిలీ.

జిమ్మీ ఇంబర్‌ని ప్రశ్నించి, సమాధానం రాబట్టాడు.

"అతడు నిన్ను భయపడవద్దంటున్నాడు" ఎమిలీ సంతోషించింది. జిమ్మీ మళ్ళీ కొనసాగించాడు "నువ్వు ఏమాత్రం బలంగా లేవట. చంటిపిల్లలా సున్నితంగా వున్నావట. వట్టి చేతులతోనే అతడు నిన్ను ముక్కలు చేసేయగలడట. కానీ నువ్వు అమ్మవై, ఈ పోలీసులాగా ఎత్తుగా, దృఢంగా పెరిగే సంతానాన్ని కనడం అతనికి ఆశ్చర్యంగానూ, హాస్యాస్పదంగానూ ఉందట."

ఎమిలీ తన చూపుని సూటిగా, స్థిరంగా ఉంచగలిగినా, ఆమె బుగ్గలు మాత్రం ఎర్రబడి పోయాయి. డికెన్సన్ సిగ్గుతో ముడుచుకుపోయాడు. పోలీసు ముఖం యువరక్తంతో వెలిగిపోయింది.

"నిన్నే, నాతో రా!" కటువుగా అంటూ, భుజంతో గుంపుని నెడుతూ ఇంబర్‌ని తనవెంట తీసుకుపోయాడు పోలీసు.

అలా ఇంబర్ బ్యారెక్స్ బాటపట్టాడు. అక్కడ అతడు స్వచ్ఛందంగా, సంపూర్ణంగా తన నేరాన్ని అంగీకరించి లొంగిపోయాడు. ఇక ఎన్నటికీ ఆ చోటు నుండి ఇంబర్ బయటకు రాలేదు.

ఇంబర్ బాగా అలసిపోయాడు. నిరాశ, ముసలి వయసు తాలూకు భారాలు అతని ముఖంలో కనిపిస్తున్నాయి. అతని భుజాలు తీవ్ర ప్రయాసకు లోనవడంవల్ల కిందికి జారినట్లుగా ఉన్నాయి. కళ్ళలో కాంతి లేదు. తెల్లగా ఉండవలసిన కురులు ఎండ, వాతావరణాల చేత దహించబడి, వర్ణరహితంగా, నిర్జీవంగా, పీలికలై వేల్లాడుతున్నాయి. అతడు తన చుట్టూ జరుగుతున్నవాటి పట్ల ఎలాంటి ఆసక్తీ కనబరచడంలేదు. విచారణ గది నావికులతో, బాటసారులతో కిక్కిరిసి వుంది. మంద్ర స్వరంతో వారు చేస్తున్న గద్దింపులు, ఈసడింపులు ప్రళయసూచక గానంలా, గుహలోనికి వినిపించే సాగర ఘోషలా అతని చెవులను తాకుతున్నాయి.

ఇంబర్ అక్కడ ఒక కిటికీ ప్రక్కన కూర్చున్నాడు. భావరహితమైన అతని చూపులు బయట ఉన్న నిస్తేజ దృశ్యంపై నిలిచి ఉన్నాయి. మేఘావృతమైన ఆకాశం నుండి బూడిద రంగు తుప్పర కురుస్తోంది. యూకాన్ నదికి అది వరదల సమయం. మంచు కరిగి, నది ఊళ్ళోకి చొచ్చుకొచ్చింది. ప్రధాన వీధిలో ప్రజలు చిన్న చిన్న పడవలపై నిరంతరాయంగా అటు, ఇటు రాకపోకలు సాగిస్తున్నారు. వాటిలో కొన్ని పడవలు వీధి నుండి సైనిక స్థావరాలవైపు మలుపు తిరిగి వరదనీటితో నిండిన కవాతు మైదానంలోకి ప్రవేశిస్తున్నాయి. ఇంకొన్ని పడవలు సరిగ్గా అతడున్న భవనం కింది అంతస్తు దగ్గరకు వచ్చి మాయమవుతున్నాయి. తరువాత అవి ఆ భవనం యొక్క కలప గోడలను ఢీకొన్న శబ్దం అతనికి వినిపించేది. ఆ పడవలలో వచ్చినవారు కిటికీల గుండా భవనంలోకి చొరబడి, తమ అడుగులతో ఆ ప్రాంతాన్నంతా బురదమయం చేసి, మెట్లదారి గుండా పై అంతస్తుని చేరుకుంటున్నారు. చివరిగా వారు తమ తలలపై టోపీలను తీస్తూ, తడి బూట్లతో ఇంబర్ ఉన్న గది ద్వారం వద్ద ప్రత్యక్షమై, అక్కడ వేచివున్న వారిలో కలుస్తున్నారు.

అక్కడ అందరి చూపులూ ఇంబర్‌పైనే ఉన్నాయి. అతడు చెల్లించబోయే మూల్యాన్ని అంచనా వేస్తూ వారు లోలోనే ఆనందిస్తున్నారు. ఇంబర్ వారినీ, వారి పద్ధతులను, వారి చట్టాన్నీ చూసి ఆశ్చర్యపోయాడు. మంచి రోజులైనా, చెడ్డ రోజులైనా, కరువొచ్చినా, వరదలొచ్చినా, కష్టాలలో, భయంలో, చావులో, పగలూ, రాత్రీ నిర్విరామంగా సాగిపోయే వారి చట్టం అతడికి అంతం లేనిదిగా, నిత్యమైనదిగా తోచింది.

ఇంతలో అక్కడ ఒక వ్యక్తి బల్లపై గట్టిగా తట్టగానే ఆ సంభాషణలు నిశ్శబ్దంగా మారిపోయాయి. ఇంబర్ అతణ్ణి చూసి, అధికారగణంలో ఒకడిగా గుర్తించాడు. అయితే అందరికంటే వెనుకగా ఉన్న పెద్ద బల్ల దగ్గర కూర్చున్న పలకనుదురున్న వ్యక్తినే అక్కడున్న అందరికి పైనవుండే నాయకుడని, బల్లను చరిచినవాడి కంటే కూడా ఉన్నతమైన స్థానంలో ఉన్నవాడని గ్రహించాడు. అదే బల్ల దగ్గర ఉన్న మరొకడు లేచి నిలబడి, కొన్ని పలుచటి

పత్రాలను చూస్తూ గట్టిగా చదవడం ప్రారంభించాడు. ప్రతీ కాగితాన్నీ చదవడం మొదలుపెట్టే ముందుగా గొంతును సవరించుకుంటున్నాడు. కాగితం చివరికి వచ్చేసరికి వేళ్ళను తడిచేసుకుంటున్నాడు. ఇంబర్‌కి ఆ ఉపన్యాసం అర్థం కావడంలేదు. అయితే అక్కడున్న అందరికీ అది అర్థమవుతుందనీ, అది వారిని ఆగ్రహానికి గురిచేస్తోందని ఇంబర్ గ్రహించాడు. ఒక్కొక్కసారి వాళ్ళు తీవ్ర ఆగ్రహావేశాలకు గురౌతున్నారు. ఒక సందర్భంలో ఒకడు ఆవేశంతో ఊగిపోతూ, ఏక పద శబ్దాలతో ఇంబర్‌కి శాపనార్థాలు పెట్టాడు. బల్ల దగ్గర కూర్చున్నవాళ్ళలో ఒకడు అతడిని వారించాడు.

అలా ఆ మనిషి అదే పనిగా చదువుతున్నాడు. ఒకే శ్రుతిలో, సుదీర్ఘంగా సాగుతున్న గానంలాంటి ఆ ఉపన్యాసం ఇంబర్‌ని కలల్లోకి తీసుకుపోయింది. ఆ ఉపన్యాసం పూర్తయ్యే సరికి ఇంబర్ కలల్లో మునిగిపోయి ఉన్నాడు. ఇంతలో వైట్ ఫిష్ భాషలో ఒక గొంతు ఇంబర్‌తో మాట్లాడింది. ఇంబర్ ఎలాంటి ఆశ్చర్యం లేకుండా తల పైకెత్తి తన సోదరి కొడుకు ముఖాన్ని చూశాడు. అతడు తెల్లవాళ్ళ సాహచర్యం కోసం, ఏళ్ల క్రితం తమను వదిలి వెళ్ళిపోయిన యువకుడు.

"నీకు నేను గుర్తున్నానా?" పలకరింపుగా అడిగాడా యువకుడు.

"లేదు" ఇంబర్ సమాధానం చెప్పాడు.

"నేను హౌకాన్ని. మిమ్మల్ని వదిలి వెళ్ళిపోయాను కదా. మా అమ్మ చనిపోయి ఉంటుంది. ఆవిడ ముసలిదైపోయింది కదా!" అన్నాడు ఆ యువకుడు.

కానీ ఇంబర్ ఆ మాటలు వినలేదు. హౌకాన్ అతడి భుజాలపై చేతులు వేసి అతణ్ణి పైకి లేపాడు.

"ఇప్పటిదాకా ఆ మనిషి చదివినవన్నీ నేను నీకు చెబుతాను. అవి కెప్టెన్ అలగ్జాండర్ దగ్గర నీకు నీవుగా చేశానని చెప్పుకున్న నేరాలు. అవన్నీ విని, అర్థం చేసుకుని, అవి నిజాలో కావో చెప్పాలి. ఇది అధికారుల ఆదేశం."

జానపద దౌత్యసంఘంలో చేరిన హౌకాన్‌కి అక్కడి వారు చదవడం, వ్రాయడం నేర్పించారు. అతని చేతిలో కొన్ని పలుచటి పత్రాలున్నాయి. మొదట ప్రసంగించిన వ్యక్తి గట్టిగా చదివింది వాటినే. కెప్టెన్ అలగ్జాండర్ దగ్గర జిమ్మీ నోటి ద్వారా ఇంబర్ నేరాంగీకారం చేస్తుండగా, అక్కడి గుమాస్తా వ్రాసిన కాగితాలవి. హౌకాన్ వాటిని చదవడం ప్రారంభించాడు. అది కొద్దిసేపు విన్న తరువాత ఇంబర్ ఆశ్చర్యపోతూ ఒక్కసారిగా హౌకాన్ ప్రసంగానికి అడ్డుపడ్డాడు.

"హౌకాన్, అది నా సంభాషణ. నువ్వు స్వయంగా నీ చెవులతో దానిని వినకుండానే, అది నీ నోటి నుండి వస్తోందే!"

హౌకాన్ గర్వంగా ఒక నవ్వు నవ్వాడు. అతడిది మధ్య పాపిడి తీసిన జుట్టు. "అలా కాదు ఇంబర్, అది ఈ కాగితాల నుండి వస్తుంది. నా చెవులు దానిని వినలేదు. అది ఈ కాగితాల నుండి, నా కళ్ళ ద్వారా నా తలలోకి వెళ్లి, అక్కడి నుండి నా నోటి ద్వారా వస్తోంది. అదీ విషయం."

"అలా వస్తుందా? అది ఆ కాగితాలలో ఉందా?" విస్మయంతో ఇంబర్ మాట గుసగుసలలో ఇంకిపోయింది. అతను వేళ్ళ మధ్య పెళపెళలాడుతున్న కాగితాలపై రాతను అలా కళ్లార్పకుండా చూసి, "ఇది గొప్ప తాంత్రిక విద్య హౌకాన్! నువ్వు గొప్ప కళను నేర్చావ్!" అన్నాడు.

"ఇదేమంత గొప్ప విషయం కాదు" ఆ యువకుడు గర్వంతో విసురుగా స్పందించాడు. అతడు ఆ ప్రతుల నుండి ఒక ఘోరాన్ని చదివాడు : "ఆ సంవత్సరం, మంచు కరగడానికి ముందు, ఒక ముసలివాడు, ఒక బాలుడు వచ్చారు. ఆ పిల్లాడు ఒకటే కాలున్న అవిటివాడు. వాళ్ళని కూడా నేను చంపాను. ఆ ముసలివాడు చాలా గోల చేశాడు.."

"ఇది నిజమే!" ఇంబర్ మళ్ళీ అడ్డుతగిలాడు. "అతను చాలా గోల చేశాడు. చాలా సేపటివరకూ చావలేదు. కానీ నీకెలా తెలుసు హౌకాన్? బహుశా నీకు తెల్లవాళ్ళ నాయకుడు చెప్పి ఉంటాడు. అతను ఒంటరిగా ఉన్నప్పుడే నేను ఇది చెప్పాను. అప్పుడు నన్ను ఎవరూ చూడలేదు."

హౌకాన్ అసహనంగా తలాడించాడు, "వెర్రివాడా, ఇది నాకెవ్వరూ చెప్పలేదు. అంతా ఈ కాగితాలలో ఉందని చెప్పాను కదా!"

ఇంబర్ ఆ సిరా పారిన కాగితాలను తీక్షణంగా చూసి ఇలా అన్నాడు : "ఒక వేటగాడు మంచుమీద ఆనవాళ్ళని చూసి, ఇదిగో, నిన్న ఇలా ఒక కుందేలు వెళ్ళింది. ఈ విల్లో పొదల మాటున ఆగి, ఒక శబ్దాన్ని వింది. ఇదిగో ఇక్కడ ఈ దారిలో పారిపోయింది. ఇక్కడ ఇంకా వేగంగా, పెద్ద పెద్ద అంగలతో పరిగెత్తింది. ఇక్కడ మరింత వేగంతో, మరింత పెద్ద అంగలతో ఒక పెద్ద అడివి పిల్లి దాని వెంటపడింది. ఇదిగో మంచులో లోతైన గోళ్ళ గురుతులున్నచోట పిల్లి చాలా పెద్ద అంగ వేసింది. ఇక్కడ ఢీ కొట్టగానే, ఆ పిల్లి క్రింద కుందేలు పొట్టతో దొర్లింది. ఇదిగో ఇక్కడి నుండి ఒంటరి అడివి పిల్లి అడుగులు. కుందేలు మరింక లేదు – ఇలా ఆ వేటగాడు మంచుపై గురుతులను చూసి గతాన్ని వివరించినట్లు నువ్వు కూడా ఆ కాగితంపై చూసి ఈ ముసలి ఇంబర్ చేసిన పనులు చెబుతున్నావా?"

"అంతేలే. మేం నిన్ను మాట్లాడమని అడిగేదాకా నీ ఆడ నాలుకను పళ్ళ మధ్య గట్టిగా బంధించి, నేను చెప్పింది విను" చెప్పాడు హౌకాన్.

అప్పటినుండి, చాలాసేపటి వరకు, హౌకాన్ ఇంబర్‌కి నేరాంగీకార పత్రాన్ని చదివి వినిపించాడు. ఇంబర్ ఆశ్చర్యపోతూ నిశ్శబ్దంగా ఉండిపోయాడు. చదవడం పూర్తయ్యాక ఇంబర్ ఇలా అన్నాడు :

"అవి నా మాటలే. అవన్నీ నిజాలు. హౌకాన్, నేను ముసలివాడినైపోయాను. మరిచిపోయిన విషయాలను గుర్తుచేసుకుని చెబుతాను. మీ నాయకుడు వాటిని వినాలి. ముందుగా, కుతంత్రపు ఇనుప ఉచ్చులతో ఒకడు మంచు కొండల్ని దాటుకుని, వైట్ ఫిష్ బీవర్లను వేటాడడానికి వచ్చాడు. వాడిని నేను చంపేశాను. తరువాత ముగ్గురు మనుషులు బంగారం కోసం వైట్ ఫిష్ ప్రాంతానికి వచ్చారు. వారిని కూడా చంపి, ఒల్వరీన్‌లకు ఆహారంగా వేసేశాను. తరువాత ఫైవ్ ఫింగర్స్ ప్రాంతానికి ఒక పంటిమీద బోలెడు మాంసంతో ఒకడొచ్చాడు."

ఇంబర్ జ్ఞాపకాలను గుర్తుచేసుకోవడానికి ఆగిన సమయంలో, హౌకాన్ అతని మాటలను అనువదిస్తున్నాడు. అక్కడున్న ఒక గుమాస్తా వంగి వాటిని వ్రాసుకుపోతున్నాడు. న్యాయస్థానంలోని వారంతా, ప్రతి విషాద గాథనూ నిశ్శబ్దంగా వింటున్నారు. అయితే, ఇంబర్ తాను చాలా దూరం నుండి గురిచూసి చంపిన ఒక ఎర్రజుట్టు మెల్లకళ్ళ వాడి విషయం చెప్పగానే ఆ నిశ్శబ్దం బద్దలైంది.

"అయ్యో!" ముందు వరుసలో కూర్చున్న వీక్షకులలో ఒకడు దీనంగా బాధతో అరిచాడు. అతడు ఎర్రజుట్టు వాడు. "అయ్యో!" మళ్ళీ అరిచాడు. "అతడు నా సోదరుడు బిల్" అన్నాడు.

అప్పటి నుండి అదేపనిగా అతని నోటి నుండీ వస్తున్న 'అయ్యో' అనే మాట ఆ గదిలో దీనంగా వినిపిస్తూనే ఉంది. తోటివారు గాని, ఆ బల్ల దగ్గర మనిషి గాని అతణ్ణి వారించలేదు.

ఇంబర్ తల మరోసారి వాలిపోయింది. ఒక పొరలాంటిది కమ్మేయడం వల్ల ప్రపంచం నుండి వేరుపడినట్లు అతని కళ్ళు నిర్జీవంగా ఉన్నాయి. ఆ వయసులో పూర్తిగా వ్యర్థమైపోయిన తన యవ్వనాన్ని తలుచుకుంటూ కలల్లోకి వెళ్ళిపోయాడు.

హౌకాన్ ఇంబర్ని మళ్ళీ లేవదీశాడు. "ఓ ఇంబర్, లేచి నిలబడు. నిన్ను ఆదేశిస్తున్నాం. ఈ నేరాలన్నీ ఎందుకు చేశావు? వాళ్ళందరినీ ఎందుకు చంపావు? చివరికి ఇంత దూరం వచ్చి, శిక్షని ఎందుకు కోరుకుంటున్నావు?"

ఇంబర్ నీరసంగా ముందుకూ, వెనక్కూ తూలుతూ లేచాడు. అతడు సన్నని స్వరంతో బరువుగా మాట్లాడం మొదలుపెట్టాడు. కానీ హౌకాన్ అతడికి అడ్డుతగిలాడు.

"ఈ ముసలాడు పిచ్చోడు. మూర్ఖంగా, చిన్నపిల్లాడిలా మాట్లాడుతున్నాడు" అని

ఆంగ్లంలో పలకనుదురు పెద్దమనిషితో చెప్పాడు.

"అతడు చిన్నపిలాడిలా మాట్లాడినా సరే, మేం వింటాం. అతని నోటి నుండి వచ్చే ప్రతీ మాటనీ యథాతథంగా మేం వినాలి. అర్థమైందా?"

హౌకాన్‌కి విషయం అర్థమైంది. తెల్లాళ్ళ ముఖ్య నాయకునికి, తన మేనల్లుడికీ మధ్య జరిగిన దానిని గమనించిన ఇంబర్ కళ్ళు మెరిశాయి. ఇక అప్పుడు మొదలైంది, రాగి వర్ణ దేహం గల దేశభక్తుని మహనీయ గాథ. రాబోవు తరాలకై రాగి ఫలకాలపై లిఖించదగిన వీరగాథ. అక్కడి వారిని ఒక వింతైన నిశ్శబ్దం ఆవహించింది. పలకనుదురు న్యాయమూర్తి తన తలను చేతులపై ఆనించి, తన ఆత్మని, తన జాతి ఆత్మని ఆ కథపై లగ్నం చేశాడు. ఇంబర్ గొంతు చేసే బరువైన స్వరాలు, వాటిని ఆగి, ఆగి లయబద్ధంగా పలుకుతున్న అనువాదకుడి కీచు గొంతు, అప్పుడప్పుడూ దేవుని గుడిలో గంటలా 'అయ్యో' అని దీనంగా పలికే ఎర్రజుట్టువాని గొంతు.. ఇవే ఆ గదిలో వినిపిస్తున్న శబ్దాలు.

"నేను వైట్ ఫిష్ తెగకు చెందిన ఇంబర్‌ను" హౌకాన్ అనువాదం మొదలైంది. ఇంబర్ కథ యొక్క హింసాత్మక లయని అందుకునే క్రమంలో అతను తొడిగిన ఆంగ్ల సంస్కృతీ, సాంప్రదాయాల ముసుగు తొలగిపోయి, అంతర్లీనంగా ఉన్న మొరటు ఆటవికతనం అతణ్ణి ఆవహించింది. "నా తండ్రి ఓట్స్ బక్, అతను బలమైన మనిషి. నా బాల్యంలో మా ప్రాంతం వెచ్చని సూర్యకాంతితో ఆనందమయంగా ఉండేది. ప్రజలు వింత విషయాల వెంట పరుగులు తీసేవారుకారు. వింత గొంతులను వినేవారుకారు. వారి తండ్రులు నడిచిన బాటే వారి బాట. ఆడవారికి యువకుల కళ్ళలో అభిమానం కనిపించేది. యువకులు తమ ఆడవారి వంక సంతృప్తిగా చూసేవారు. తెగ వికాసానికి ప్రతీకలుగా బొద్దుగా ఉండే పసిబిడ్డలు ఆడాళ్ళ చన్నులను హత్తుకుని ఉండేవారు. అప్పటి మగాళ్ళు మగాళ్ళు. శాంతి-సుభిక్షాల కాలమైనా, యుద్ధ-దుర్భిక్షాల కాలమైనా వాళ్ళు మగాళ్ళుగా ఉండేవాళ్ళు.

"ఆ కాలంలో నీటిలో మత్స్యసంపద పుష్కలంగా ఉండేది. అడవిలో వేట కూడా సమృద్ధిగా ఉండేది. అప్పటి మా కుక్కలు తోడేలు జాతివి. అవి దట్టమైన బొచ్చుతో చలినీ, తుఫానునీ తట్టుకుని, వెచ్చగా ఉండేవి. అవి మాతో ఉన్నంత కాలం మేం కూడా చలినీ, తుఫానునీ లెక్కచేసేవాళ్ళం కాదు. పెల్లీ తెగవాళ్ళు మా ప్రాంతంలోకి చొరబడినపుడు మేం వాళ్ళను చంపేవాళ్ళం, వాళ్ళచే చంపబడేవాళ్ళం. మేం మగాళ్ళం గనుక, మా వైట్ ఫిష్ వాళ్ళు, మా తండ్రులు, మా తండ్రుల తండ్రులు పెల్లీలతో పోరాడి సరిహద్దులు నిర్ణయించారు.

"మా కుక్కలు మాతో ఉన్నంత కాలం మాకేమీ కాదని చెప్పాను కదా. ఇక ఒకరోజు

వచ్చాడు, మొట్టమొదటి తెల్లవాడు. మంచుపై మోకాళ్ళతో, చేతులతో దేకుతూ వచ్చాడు. అతని చర్మం బిర్రబిగుసుకుపోయింది. దాని క్రింద ఎముకలు బయటకు పొడుచుకుని ఉన్నాయి. అటువంటి మనిషి ఉంటాడని మేం అనుకోలేదు. ఆ వింత తెగ ఏంటో అనీ, దాని ప్రాంతం ఎక్కడుందో అనీ మేం ఆశ్చర్యపోయాం. అతడు బలహీనంగా ఉన్నాడు. పసిపిల్లాడిలా చాలా దుర్భరంగా ఉన్నాడు. మేం అతనికి మంట దగ్గర చోటిచ్చి, వెచ్చటి చర్మాలు కప్పి, చిన్నపిల్లాడికి తినిపించినట్లు ఆహారం పెట్టాం.

"అతనికి తోడు ఓ కుక్కుంది. అది మా మూడు కుక్కలకి సరితూగుతుంది. అది కూడా దుర్భర స్థితిలో ఉంది. దాని బొచ్చు చాలా పలచటిది. వెచ్చదనం లేదు. దాని తోక గడ్డకట్టుకుపోయి వేల్లాడుతోంది. దానికి కూడా తిండి పెట్టి, మంట పక్కన పడుకోబెట్టాం. మా కుక్కలను అక్కడి నుండి తరిమేశాం. లేకపోతే అవి దాన్ని చంపేసేవే. దుప్పి మాంసం, ఎండబెట్టిన సాలమన్ చేపలు తిని ఆ మనిషి, అతని కుక్క బలం పుంజుకున్నారు. ఆ బలం వారికి దృఢత్వాన్నీ, ధైర్యాన్నీ ఇచ్చింది. అతడు గట్టిగా మాట్లాడుతూ, ముసలివారినీ, యువకులను చూసి హేళనగా నవ్వేవాడు. కన్నెపిల్లల వంక సూటిగా, నిర్భయంగా చూసేవాడు. ఆ కుక్క మా కుక్కలతో పోట్లాడేది. అది బొచ్చు లేకుండా, సున్నితంగా ఉంటూనే, ఒకే రోజు మూడు కుక్కల్ని చంపేసింది.

"మేం అతణ్ణి తనవారి గురించి అడిగితే, కపటమైన నవ్వొకటి నవ్వి, 'నాకు చాలా మంది సోదరులున్నార'ని చెప్పాడు. పూర్తి బలం పుంజుకున్నాక అతను మా వద్ద నుండి వెళ్ళిపోయాడు. అతనితో పాటు మా నాయకుని కూతురు నోడా కూడా వెళ్ళిపోయింది. ఆ తరువాత కొన్నాళ్ళకు మొట్టమొదటిసారిగా ఒక ఆడకుక్క ఒక వింతైన పిల్లని పెట్టింది. మేం ఆ రకం కుక్కని ఎప్పుడూ చూసి ఎరగం. దాని పెద్ద తల, ఒత్తైన పంజాలు, పలుచటి బొచ్చు, ఇంకా అసహాయ స్థితి. మా నాన్న, ఓట్స్ బక్ బలమైన మనిషి. అతని ముఖం ఆ అసహాయ స్థితిని చూసి నల్లబడిపోయింది. అతను ఒక రాయితో దానిపై అలా, అలా... ఇక అక్కడ అసహాయ స్థితి లేదు. రెండు వేసవుల తరువాత ఒక మగ పిల్లాడిని చంకనెత్తుకుని నోడా మా దగ్గరికి తిరిగొచ్చింది.

అది మొదలు, తరువాత కొన్నాళ్ళకు పలుచటి బొచ్చున్న కుక్కలను వెంటబెట్టుకుని రెండో తెల్లవాడొచ్చాడు. వాడు వెళ్ళేటపుడు ఆ కుక్కలను మాదగ్గరే వదిలేసిపోయాడు. అతడు మా అమ్మ సోదరుడైన కూసోటీతో బేరం చేసుకుని, మాదగ్గర నుండి ఆరు బలమైన కుక్కల్ని తీసుకుపోయాడు. దానికి బదులుగా వాడు కూసోటీకి ఒక అద్భుతమైన తుపాకీని ఇచ్చాడు. అది మెరుపు వేగంతో ఆరుసార్లు పేలుతుంది. భారీకాయుడైన కూసోటీ ఆ తుపాకీని చూసుకుని, మా విల్లంబులను అవహేళన చేశాడు. వాటిని ఆడాళ్ళ

వస్తువులన్నాడు. వాడు ఆ తుపాకీని పట్టుకుని, చారముఖం రాకాసి ఎలుగుబంటికి ఎదురెళ్ళాడు. అయితే తుపాకీతో రాకాసి ఎలుగ్గొడ్డుని వేటాడకూడదన్న విషయం ఇప్పుడు మాకు తెలుసు. కానీ అప్పుడు అది మాకెలా తెలుస్తుంది? కూసోటీకెలా తెలుస్తుంది? కాబట్టీ వాడు ధైర్యంగా ఆ చారముఖందానికి ఎదురెళ్ళి, తుపాకీని వేగంగా ఆరుసార్లు పేల్చాడు. ఆ ఎలుగ్గొడ్డు ఒక్క గద్దింపుతో, వాణ్ణి గుడ్డుని కొట్టినట్టు ఒక్క గుద్దు గుద్దింది. తేనెపట్టు నుండీ తేనె కారినట్టు, వాడి మెదడు నేలపై పడింది. వాడు మంచి వేటగాడు. వాడి పెళ్ళాం, పిల్లలకు ఆహారం తెచ్చేవాళ్ళు లేకుండాపోయారు. మేం ఎంతగానో విచారించాం. 'తెల్లవాళ్ళకి మేలుచేసేవి మాకు మేలుచేయవ'ని అనుకున్నాం. ఇది నిజం. తెల్లవాళ్ళు చాలా సంఖ్యలో, బలంగా వుంటారు. కానీ అదే తెల్లవాళ్ళ పద్ధతులు మేం అనుసరిస్తే మా సంఖ్య హరించుకుపోయి మేం బలహీనులమయ్యాం.

"మూడోవాడు గొప్ప సంపదలతో, అబ్బురపరిచే రకరకాల ఆహార పదార్థాలతో, వస్తువులతో వచ్చాడు. వాడు బేరం చేసి, బలమైన ఇరవై కుక్కలను మా దగ్గర నుండి తీసుకుపోయాడు. అలాగే బహుమతులిచ్చి, గొప్ప గొప్ప వాగ్దానాలు చేసి, పదిమంది మా యువవేటగాళ్ళని మేమెవ్వరం ఎరుగని సుదూర ప్రాంతానికి తనకూడా తీసుకుపోయాడు. వారంతా భూమికి అంచున ఉన్న, మనుషుల జాడలేని నిశ్శబ్దపు కొండలలో, మంచులో కూరుకుని చనిపోయారని చెప్పుకునేవాళ్ళు. ఏది ఏమైనా ఆ యువ వేటగాళ్ళనూ, ఆ కుక్కలనూ మళ్ళీ వైట్ ఫిష్ ప్రజలెవ్వరూ చూడలేదు.

"అలా ఏళ్ళు గడిచేకొద్దీ, మరింత మంది తెల్లవాళ్ళు సంపదలతో, కానుకలతో వచ్చి, మా యువకులను తమ వెంట తీసుకుపోతూనే ఉన్నారు. కొన్నిసార్లు ఆ యువకులు భయంకరమైన, బాధాకరమైన కథలతో, అనుభవాలతో పెల్లీల భూభాగం అవతల ప్రాంతాల నుండీ తిరిగొచ్చేవారు. కొన్నిసార్లు వారసలు తిరిగొచ్చేవారేకాదు. 'తెల్లవాళ్ళ జనాభా చాలామంది ఉంటారు కాబట్టీ, వాళ్లకి జీవితమన్నా, ప్రాణమన్నా విలువలేదు. కానీ మన వైట్ ఫిష్ తెగవాళ్ళం చాలా కొద్దిమందే ఉన్నాం. ఇక మీదట మన యువకులెవ్వరూ తెల్లవాళ్ళతో వెళ్లకూడద'ని నిర్ణయించాం. అయినా యువకులు వెళ్ళిపోయారు. యువతులు కూడా వెళ్ళిపోయారు. మాకు పట్టలేని ఆగ్రహం కలిగింది.

"మేం వారి పిండి, ఉప్పుతో నిలువచేసిన పంది మాంసం, ఆహ్లాదాన్నిచ్చే తేనీరుల రుచిమరిగిన మాట నిజం. ఆ తేనీరు త్రాగకుండా ఉండలేకపోయేవాళ్ళం. అది లేకపోతే నోట మాట రాక, ప్రతీదానికీ చిర్రుబుర్రులాడేవాళ్ళం. తెల్లాళ్ళు వ్యాపారం కోసం తెచ్చిన వస్తువులపై విపరీతమైన వ్యామోహం పెంచుకున్నాం. వ్యాపారం! వ్యాపారం! వ్యాపారం! నిత్యం వ్యాపారమే! ఒక చలికాలమైతే, మేం మా దగ్గరున్న మాంసాన్ని పాడైపోయిన

గడియారాలకు, అరిగిపోయిన ఆకురాళ్ళకు, గుళ్ళు లేని తుపాకులకు ఇలా వ్యర్థమైన వాటికి బేరం పెట్టేశాం. ఆ తరువాత వచ్చిన కరువుకి ఆహారంలేక మలమల మాడి, వసంతం వచ్చేసరికి ఆకలితో ఇద్దరు చచ్చిపోయారు.

"మేం బలహీనులమైపోయాం. పెల్లీలు వచ్చి మా మీద పడి, సరిహద్దుల్ని చెరిపేస్తారని భయపడ్డాం. కానీ మాకు జరిగిందే వాళ్ళకూ జరిగింది. వాళ్ళు కూడా బలహీనులైపోయారు.

"నా తండ్రి ఓట్స్ బక్ బలవంతుడు. అప్పటికి ముసలాడై, ఎంతో జ్ఞానాన్ని ఆర్జించాడు. అతను మా నాయకునితో ఇలా అన్నాడు : 'చూడండి, మన కుక్కలు ఎలా పనికిరాకుండా పోయాయో. వాటికి దట్టమైన బొచ్చు లేదు, దృఢత్వం లేదు. అవి ఎక్కువ శ్రమించినా, మంచులో ఉన్నా చచ్చిపోతాయి. మనం గ్రామంలోకి వెళ్లి కుక్కలన్నిటినీ చంపేద్దాం, ఒక్క తోడేలు జాతివాటిని తప్ప. వాటిని తీసుకెళ్ళి రాత్రిళ్ళు అడివిలో కట్టేస్తే, అవి అడవి తోడేళ్ళతో జతకడతాయి. అలా మనం మన వెచ్చటి, బలమైన కుక్కలను తిరిగి పొందొచ్చు.'

"అతని మాట విన్నాం. మేం, వైట్ ఫిష్ వాళ్ళం, ఆ ప్రాంతంలోకెల్లా శ్రేష్టమైన కుక్కలకు ప్రసిద్ధి పొందాం. కానీ మేం మేముగా ఉండలేకపోయాం. మాలో శ్రేష్టులైన యువతీ, యువకులు తెల్లవాళ్ళతో త్రోవలపై, నదులపై సుదూర మజిలీలకు పోయారు. వెళ్ళిన పడుచు స్త్రీలు కొందరు నోడాలా ముసలివాళ్లై, కృంగిపోయి తిరిగొచ్చేవారు. కొందరు అసలు తిరిగిరాలేదు. యువకులు కొంత కాలంపాటు మంట దగ్గర కాలక్షేపం చేయడానికి తిరిగొచ్చేవారు. బూతులు మాట్లాడుతూ, మూర్ఖంగా ప్రవర్తించేవాళ్ళు. దుష్ట పానీయాలు తాగుతూ, రాత్రీ పగలూ జూదమాడుతూ గడిపేవాళ్ళు. తెల్లవాళ్ళు వచ్చి తిరిగి వాళ్ళని ఎక్కడికో తీసుకుపోయేదాకా వాళ్ళ హృదయాలు అలజడితో రగిలిపోయేవి. వాళ్ళకు పెద్దలపట్ల గౌరవం ఉండేది కాదు. పాత సాంప్రదాయాలను ఎగతాళి చేసే వాళ్ళు. నాయకుడిని, మంత్రగాళ్ళను చూసి హేళనగా నవ్వేవాళ్ళు.

"మేము, అంటే మా వైట్ ఫిష్ తెగ నిర్వీర్యమైపోయిందని చెప్పాను కదా. మేం మా వెచ్చటి చర్మాలను, కంబళ్ళను పొగాకు కోసం, మద్యం కోసం, పలచని నూలు వస్త్రాల కోసం అమ్మేసుకుని, చలిలో గజగజ వణుకుతూ ఉండిపోయాం. దాంతో మాకు దగ్గు జాడ్యం పట్టుకుంది. ఆడాళ్ళూ, మగాళ్ళూ తెల్లార్లూ దగ్గుతూ నరకయాతన పడేవాళ్ళు. వేటగాళ్ళు మంచుపై రక్తపు కళ్లి ఉమ్మేవాళ్ళు. ఒకరి తరవాత ఒకరు హఠాత్తుగా రక్తం కక్కుకుని చనిపోయేవాళ్ళు. ఆడాళ్ళకు పిల్లలను కనే సామర్థ్యం తగ్గిపోయింది. పుట్టిన పిల్లలు కూడా బలహీనంగా ఉండి, అనారోగ్యాల పాలయ్యేవాళ్ళు. తెల్లాళ్ళ నుంచి కూడా మాకు కనీ, వినీ ఎరుగని జబ్బులేవో అంటుకున్నాయి. పొంగు, మశూచి లాంటి పేర్లేవో వినిపించేవి. గుడ్లు పెట్టిన సాలమన్ చేపలు ఇక జీవించాల్సిన అవసరంలేక చచ్చినట్లు,

మా జీవితాలు కూడా ఆ జబ్బుల బారినపడి అర్ధంతరంగా ముగిసిపోయేవి.

"ఆశ్చర్యకర విషయమేమిటంటే, తెల్లవాళ్ళు చావు వాసన నిండిన గాలిలా వచ్చినా, ఆ గాలితో వారి ముక్కుపుటాలు నిండిపోయినా, వారి పద్ధతులన్నీ మృత్యువుకే దారితీసినా కూడా మృత్యువు వారి దరిచేరదు. వారి మద్యం, పొగాకు, బొచ్చు లేని కుక్కలు, వాళ్ళ జబ్బులు, పొంగు, మశూచి, రక్తం కక్కించే దగ్గూ, వాళ్ళ తెల్లతోలూ, మంచుని, తుఫానుని తట్టుకోలేని సున్నితత్వం, ఆరుసార్లు వేగంగా పేలే తుపాకులు, ఇవన్నీ ఉన్నా కూడా వాళ్ళు రోజు రోజుకీ బలుస్తూ, సంపన్నులౌతారు. తక్కిన ప్రపంచంపై తమ ఉక్కు హస్తాన్ని మోపి, ఆ ప్రజల మీద విరుచుకుపడతారు. వారి ఆడవాళ్ళు పసిపాపల్లా సున్నితంగా, బలహీనంగా ఉంటూనే తల్లులవుతారు. ఆ బలహీనత, సున్నితత్వాల నుండే దృఢత్వానికీ, శక్తికీ, అధికారానికీ జన్మనిస్తారు. వాళ్ళు దేవుళ్లో, దెయ్యాలో ఏమైనా కానీయండి. నాకదేమీ తెలీదు. ముసలి వైట్ ఫిష్ ఇంబర్‌ని, నాకేం తెలుస్తుంది? వాళ్ళు ఈ నేల మీదికి, ఎక్కడి నుంచో యుద్ధం చేయడానికి వచ్చారన్నది మాత్రమే నాకు అర్థమయింది.

"అడవిలో వేట రోజు రోజుకీ తరిగిపోయింది. నిజమే, తెల్లాడి తుపాకీ ఎంతో అద్భుతమైంది. చాలా దూరం నుంచే దెబ్బ కొట్టగలదు. కానీ అడవిలో వేటాడ్డానికి వేటే లేకపోతే ఆ తుపాకీ ఎందుకు? నా బాల్యంలో, మా వైట్ ఫిష్ ప్రాంతంలో ప్రతీ కొండపై దుప్పులు ఉండేవి. ప్రతీ ఏడూ పెద్ద సంఖ్యలో మంచు జింకలు వలస వచ్చేవి. మరిప్పుడు, వేటగాడు పది రోజులు మాటువేసి ఎదురుచూసినా, ఒక్క దుప్పి కూడా అతని కళ్ళబడడం లేదు. అసంఖ్యాకంగా వచ్చే మంచు జింకలు అసలు వలస రావడం మానేశాయి. వేటాడడానికి ఏదీ లేనపుడు తుపాకీకి విలువే ఉండదు.

"అడవిలో జంతువుల మాదిరిగానే, మా వైట్ ఫిష్, పెల్లే అలాగే మిగిలిన తెగల ప్రజలు కూడా ఊచకోతకు గురికావడం నన్ను మదనపడేలా చేసింది. చాలా తీవ్రంగా మదనపడ్డాను. నేను తెలివిగల ముసలాళ్ళతోనూ, మంత్రగాళ్ళతోనూ ఈ విషయాన్ని చర్చించాను. గ్రామంలో శబ్దాల వల్ల నా ఆలోచనలకు భంగం కలగకుండా, దూరంగా పోయాను. అతిగా తినడం వల్ల ఊబకాయుడినై, దృష్టి, వినికిడి మందగించకుండా ఉండడానికి మాంసం తినడం మానేశాను. నేను ఎదురుచూస్తున్న ఆదేశం కోసం కళ్ళు పెద్దవి చేసి, ఉపదేశం కోసం చెవులు రిక్కరించి నిద్రపోకుండా అడవిలో వేచాను. నిశి రాత్రులలో నది ఒడ్డుపై తిరుగుతూ, గాలి చేసే నిట్టూర్పులలో, నీరు చేసే ఉచ్ఛ్వాస, నిశ్వాస శబ్దాలలో గతించిన మా పూర్వీకుల ఉపదేశాలను వినడానికి ప్రయత్నించాను.

"చివరికి నాకు కలలాంటి ఒక ఊహ వచ్చింది. అందులో అసహ్యంగా ఉన్న బొచ్చులేని కుక్కలు కొన్ని నా దగ్గరకొచ్చాయి. నేను చేయాల్సింది స్పష్టంగా తెలిసింది.

నా తండ్రి ఓట్స్ బక్, బలమైన మనిషి, మా తోడేలు జాతి కుక్కల రక్తాన్ని శుద్ధిచేసి, వాటిని తిరిగి వెచ్చని బొచ్చుతో దృఢంగా మార్చిన వైనం నా మదిలో మెదిలింది. వెంటనే గ్రామానికి వెళ్లి మగాళ్ళందరినీ సమావేశపరిచి వారితో ఇలా అన్నాను : 'ఈ తెల్లాళ్ళంతా ఒక తెగవాళ్ళు. అది చాలా పెద్ద తెగ. నిస్సందేహంగా, వాళ్ళ ప్రాంతంలో ఆహారం అనేదే లేకుండాపోయి ఉంటుంది. వాళ్ళు బ్రతకడానికి కొత్త ప్రదేశాన్ని వెతుకుతూ మన మధ్యకు వచ్చారు. కానీ వాళ్ళు మనల్ని బలహీనుల్ని చేసి, చావువైపు నడిపించారు. వాళ్ళది ఆకలి జాతి. ఇప్పటికే మనం మన ఆహారాన్ని కోల్పోయాం. ఇప్పుడు మనం బ్రతికుండాలంటే, వాళ్ళ కుక్కలతో ఎలా వ్యవహరించామో వాళ్ళతో కూడా అలాగే వ్యవహరించాలి.'

"చివరిగా వాళ్లతో యుద్ధం చేద్దామని ప్రతిపాదించాను. వాళ్ళు అంతా విన్నారు. విని, ఒకడు ఒకలా మాట్లాడాడు, ఇంకొకడు ఇంకోలా మాట్లాడాడు. కొందరు సంబంధం లేని వ్యర్థ ప్రసంగాలు చేశారు. తమ బాధ్యత గురించి, చేయాల్సిన యుద్ధం గురించీ ధైర్యంగా ఒక్కడూ మాట్లాడలేదు. ఇలా యువకులు చేవలేకుండా, పిరికిగా భయపడు తుండగా, ముసలోళ్ళు నిశ్శబ్దంగా కూర్చుని చూస్తున్నారు. అప్పుడప్పుడూ వాళ్ళ కళ్ళలో కాంతులు మెరిసి మాయమౌతున్నాయి. ఆ రాత్రి గ్రామమంతా నిద్రపోయాక, ఎవ్వరికీ తెలియకుండా నేను ముసలాళ్ళను అడవిలోకి తీసుకుపోయి ఈ విషయంమీద మరింతగా చర్చించాను. మేమంతా ఒక నిర్ణయానికి వచ్చాం. ఆనాటి ఆనందమయమైన యవ్వనాన్నీ, స్వేచ్ఛ నిండిన భూమినీ, సుభిక్షంగా జీవించిన కాలాన్నీ, వెచ్చటి సూర్యకాంతినీ, పరవళ్ళు తొక్కిన ఉత్సాహాన్నీ తలుచుకున్నాం. 'తనని ఆక్రమించుకున్న దుష్ట సంతతి నుండీ ఈ భూమిని విముక్తం చేస్తామ'ని అందరం రహస్యంగా గొప్ప ప్రతిజ్ఞ చేశాం. అది పిచ్చిపనే. కానీ ఆ సంగతి మా వైట్ ఫిష్ ముసలాళ్ళకెలా తెలుస్తుంది?

"అందరినీ కార్యోన్ముఖులను చేసే దిశగా తొలి అడుగు నేనే వేశాను. మొదటి పడవ వచ్చేదాకా యూకాన్ నది ఒడ్డున మాటువేసుకుని ఉన్నాను. ఆ పడవలో ఇద్దరు తెల్లాళ్ళు ఉన్నారు. నేను ఒడ్డుపై నిలబడి, చేయి పైకెత్తాను. అది చూసి వాళ్లు దిశను మార్చుకుని, పడవను నేనున్నవైపు నడిపారు. పడవ ముందుభాగంలో ఒంపు మీద కూర్చున్నవాడికి నేనెందుకు పిలిచానో అర్థమయ్యే ఉంటుంది. వాడు తలను పైకెత్తేసరికే, నేను సంధించిన బాణం గాలిని చీల్చుకుంటూ వెళ్లి వాడి గొంతులో దిగబడింది. అంతవరకూ తెడ్డును పట్టుకున్న రెండోవాడు తుపాకీని భుజానికెత్తుకునేలోపే, నాదగ్గరున్న మూడు బల్లేలలో మొదటిది అతణ్ణి కొట్టేసింది.

"ఇదే మొదలు" అన్నాను నేను. అంతా నా చుట్టూ గుమిగూడారు. "ఇకపై అన్ని

తెగల ముసలివాళ్ళనీ చేర్చుకుందాం. తరవాత ధైర్యవంతులైన కుర్రాళ్ళు కూడా కలుస్తారు. మన పని మరింత తేలికవుతుంది.”

“తరువాత వచ్చిన తెల్లవాళ్లిద్దరినీ నదిలో పడేశాం. వాళ్ళు వచ్చిన పడవ చాలా బాగుంది. దాన్ని ముక్కలు చేసి, ఆ ముక్కలతో ఒక మంట వేశాం. అందులో ఉన్న వస్తువులతో మరో మంట వేశాం. వాటిలో కొన్ని తోలుసంచులున్నాయి. ఆ తోళ్ళు స్వయంగా మా కత్తులతో మేం చీల్చినవే. ఆ సంచులలో చాలా పత్రాలున్నాయి. హౌకాన్, నీ చేతిలో ఉన్న పత్రాల మాదిరిగానే వాటిపై కూడా ఏవో గురుతులున్నాయి. మేం వాటిని ఆశ్చర్యంతో చూశాం. మాకేం అర్థం కాలేదు. కానీ ఇప్పుడు నాకు తెలిసింది, నువ్వే కదా చెప్పావ్, అవి మనుషుల సంభాషణలు.”

పడవ విషయాన్ని హౌకాన్ అనువదించడం పూర్తిచేసేపాటికి, సన్నని గుసగుసల హోరు ఆ గది మొత్తం వ్యాపించింది. ఒకడు పైకి గట్టిగా అన్నాడు : “అవి 1891లో తప్పిపోయిన తపాలావారి ఉత్తరాలు. పీటర్ జేమ్స్, డిలానీలు కలిసి వాటిని లేబెర్జ్ నుండీ తీసుకొస్తుండగా, మాథ్యూస్ ఆఖరిసారి వాళ్ళతో మాట్లాడాడు.” గుమస్తా చకచకా వ్రాసుకుపోతున్నాడు. ఉత్తర ప్రాంత చరిత్రలో మరో కొత్త పేరా మొదలైంది.

“చెప్పాల్సింది ఇంకొంచెం ఉంది.” ఇంబర్ మెల్లగా కొనసాగించాడు. “మేం చేసిన పనులన్నీ ఆ కాగితాలలో ఉన్నాయి. మా ముసలాళ్ళకిది తెలీదు. నాకిది ఇప్పటికీ అర్థం కావడం లేదు. హత్యలన్నీ చాలా రహస్యంగా చేశాం. అలా చేస్తూనే ఉన్నాం. ఏళ్ళు గడిచేసరికి తడబాటు లేకుండా, చాకచక్యంగా పని పూర్తిచేయడంలో అందరం ఆరితేరి పోయాం. ఒక రోజు కొరకొరా చూస్తూ, బూతులు తిడుతూ కొంతమంది తెల్లాళ్ళు మా దగ్గరకొచ్చారు. ఆరుగురు కుర్రాళ్ళను ఇనుప గొలుసులతో బంధించి, తమతో తీసుకు పోయారు. దాంతో మా పోరాటాన్ని సుదూర ప్రాంతాలకు విస్తరింపజేయాలని నిర్ణయించాం. మా ముసలాళ్ళందరం ఒక్కొక్కరుగా విడిపోయి నది ఎగువకు, దిగువకు చేరుకొని, మాకు తెలియని కొత్త ప్రాంతాలకు పోయాం. అదొక సాహసం. ఎందుకంటే తమకు తెలియని సుదూర ప్రాంతాలకు వెళ్ళడమంటే ముసలాళ్ళకు భయం. కానీ ఆ పని మేం నిర్భయంగా చేశాం.

“మేం తడబడకుండా, చాకచక్యంగా ఎన్నో హత్యలు చేశాం. చిల్కూట్ దగ్గరా, డెల్టాలోనూ, సముద్ర తీరంలో, ప్రయాణాల్లో ఉన్న తెల్లవాళ్ళు ఆగినచోటా, బసచేసిన చోటా హత్యలు చేశాం. అనేకమందిని చంపాం. కానీ ప్రయోజనం కనిపించలేదు. వాళ్ళు కొండలు దాటుకుని అలా వస్తూనే ఉన్నారు. వాళ్ళ సంఖ్య అలా పెరుగుతూనే ఉంది. మరోవైపు మేం వయసు పెరిగి ఒక్కొక్కరుగా మరణించసాగాం. నాకు బాగా

గుర్తు, ఒకసారి కరీబూ కూడలి దగ్గర ఒక తెల్లవాడు గుడారం వేశాడు. వాడు చాలా పొట్టివాడు. వాడు నిద్రపోతుండగా ముగ్గురు ముసలాళ్ళు వెళ్లి వాడిపై పడ్డారు. తరవాత రోజు నేను అక్కడికి వెళ్ళేసరికి అక్కడ నలుగురు పడి ఉన్నారు. వాళ్ళలో ఆ తెల్లవాడొక్కడే కొనవూపిరితో ఉన్నాడు. వాడు చచ్చేవరకూ నాకు శాపనార్థాలు పెడుతూనే ఉన్నాడు.

"అలా ఒక్కొక్కరిగా ముసలాళ్ళంతా రాలిపోసాగారు. కొన్నిసార్లు చనిపోయారనే కబురు మాకు చాలా కాలానికిగానీ తెలిసేదికాదు. కొన్నిసార్లు అసలు ఏ సమాచారం ఉండేది కాదు. మిగిలిన తెగల ముసలివాళ్ళు బలహీనపడి మాతో కలవడానికి భయపడ్డారు. ఒక్కొక్కరుగా అంతా పోయారని చెప్పాను కదా. చివరికి నేనొక్కడినే మిగిలాను. నేను ఇంబర్‌ని. వైట్ ఫిష్ తెగవాణ్ణి. మా నాన్న ఓట్స్ బక్, బలమైన మనిషి. ఇప్పుడిక వైట్ ఫిష్ తెగ లేదు. ముసలాళ్ళలో నేనే ఆఖరివాణ్ణి. యువకులైన మగాళ్ళూ, ఆడాళ్ళూ కొంతమంది పెల్లీలతోనూ, కొంతమంది సాల్మన్లతోనూ, చాలామంది తెల్లవాళ్ళతోనూ కలిసి బ్రతకడానికి పోయారు. నేను బాగా ముసలాడినైపోయాను. అలిసిపోయాను. ఇక చట్టంతో పోరాడినా ఫలితం లేదు. హౌకాన్, నువ్వు చెప్పినట్లు శిక్ష కోరుతూ ఇప్పుడు ఇక్కడికి వచ్చాను."

"ఓ ఇంబర్, నిజానికి నువ్వొక వెర్రివాడివి" అన్నాడు హౌకాన్.

కానీ ఇంబర్ కలల్లో ఉన్నాడు. పలకనుదురు న్యాయమూర్తి కూడా కలల్లో ఉన్నాడు. ఆ మహత్తర స్వప్నంలో అతని జాతి యావత్తూ అతని ఎదుట సాక్షాత్కరించింది. అది ఉక్కుపాదాల, ఇనుప కవచాల జాతి. అన్ని మానవ జాతులలో ఈ జాతే చట్టాన్ని ప్రయోగించేది, ప్రపంచాన్ని నిర్మించేది. అతను దాన్ని అంధకారమయ అడవులపై, నిస్తేజమైన సముద్రాలపై మిణుకు మిణుకుమనే సిందూర వర్ణ కాంతిని ప్రసరింపజేసే ఉషోదయంలా చూశాడు; భగభగలాడుతూ రక్తసిక్తమైన ఎర్రటి ఎండని ప్రజ్వలిస్తున్న అజేయమైన మిట్టమధ్యాహ్నంలా చూశాడు; రక్తంతో తడిసి ఎర్రగా మారిన నేలను వాలిన నీడలతో కమ్మేస్తున్న రాత్రిలా చూశాడు. ఆ కల ఆద్యంతం అతను తమ చట్టాన్నే పరిశీలించి చూశాడు! అది దేనికీ లోబడనిది, అన్నిటినీ శాసించేది, దయలేనిది, సర్వశక్తివంతమైనది, నిత్యమైనది. దానికి లోబడి జీవిస్తున్న, దానిచేత అణచబడిన అల్ప మానవులకన్నా అది గొప్పది. అది అతనికంటే కూడా గొప్పది. అతని హృదయం కరుణ చూపమని చెబుతోంది.

# నిప్పు రాజేయడం కోసం

మాతృక : **జాక్ లండన్ రాసిన "TO BUILD A FIRE"**

అనువాదం : **వి. విజయకుమార్**

**చ**ల్లగా వెలుగులీనుతున్న ఉదారంగు వేకువలో యూకాన్ వాగు వెంట నడుస్తూ వెళుతోన్న ఆ మనిషి కొంచెం పక్కకు తిరిగాడు. ఎత్తైన ఆ మట్టిగట్టు మీదికెక్కి, తూరుపు వైపున్న పైన్ చెట్ల తోపువైపుకి తోవతీస్తోన్న బాట దగ్గరికొచ్చాడు. నిటారుగా ఉండటం వల్లేమో, ఊపిరికోసం కాస్సేపు ఆగాడు. గడియారంవైపు చూసి ఉస్సూరనుకున్నాడు అలా కాసేపు ఆగినందుకు తనలో తనే. తెల్లారగట్ల తొమ్మిది అయ్యేపోయింది. మబ్బు చాళ్ళు లేకపోయినా పొద్దుపొడిచిన ఆనవాలుగానీ, పొడుస్తుందన్న జాడగానీ లేదింకా. నిర్మలంగా ఉంది ఆకాశం. ఎందుకోగానీ  చెప్పనలవిగాని చీకటి తెరేదో కమ్ముకున్నట్టుగా వుంది ఎటు చూసినా. ఎందుకేముంది, ఆకాశంలో వెలుగురేడు యింకా పొడసూపనేలేదు కదా. అదంత విచారించదగ్గ విషయంగా పట్టలేదా మనిషికి. ఎండెక్కకపోవడం అన్నదతడికి పట్టించుకోవాల్సిన విషయమే కాదు. ఎన్నో రోజులు గడుస్తాయి తనకి ఎండ మొహం చూడకుండానే.

వచ్చిన దారంతా ఓసారి తేరిపార చూసుకున్నాడు. ఓ మైలంత పొడవు ఇంచుమించు, యూకాన్ ప్రాంతమంతా మూడడుగుల లోతు మంచు కింద కప్పడిపోయింది. ఆ మంచు మీద మళ్లీ అదే స్థాయిలో పేరుకుపోయిన తెలిమంచు.. తెల్లగా స్వచ్ఛంగా. అటు తూరుపూ, ఇటు ఉత్తరదిశా.. కనుచూపు మేర ఎక్కడా కూడా రవ్వంత పగుళ్ల జాడ లేని తెల్లదనం ఎటుచూసినా.

కాకపోతే దక్షిణాన పైన్ చెట్ల ద్వీపం వంపు తిరిగిన పలచని నల్లని చాపరేఖలా ఆ ధవళ కాంతిని ఒకింత అడ్డుకుంది. ఆ వంపు కాస్తా ఉత్తరంవైపు చొరబడి ఇంకో పైన్ చెట్ల ద్వీపం వెనక్కి నక్కింది. ఆ నల్లటి చాపం నిజానికి అసలైన మూలం. అక్కడ్నుంచి ఐదొందల మైళ్ళు దక్షిణాది వైపుకి చిల్కూట్ పాస్ ఉప్పునీళ్ల దాకా విస్తరిస్తూ పోయింది.

ఉత్తరం వైపేమో డాసన్ వరకు ఏకంగా డెబ్బై ఐదుమైళ్లు, ఇంకో వెయ్యి మైళ్ల ముందుకెళ్లి న్యూలాటో దాకా, ఇంక చివరికి బేరింగ్ సముద్రం మీది సెయింట్ మైకేల్ వరకూ, అంటే మరో పదిహేను వందల మైళ్ళు అల్లుకుపోయిందన్నమాట.

కాగా ఇదంతా, చాలా దూరాభారం వ్యవహారం. వెలుగులేని ఆకాశం, విపరీతమైన చల్లదనం, ఎటుచూసినా ఏమీ తెలియని ప్రాంతం. అయినా ఆ మనిషికి ఇవేవీ పట్టినట్టు లేదు. అలాని ఆ మనిషికి ఇదంతా తెలిసిన ప్రాంతమేమో అనుకునేరు, నిజానికి ఆ ప్రాంతానికి అతడు పూర్తిగా కొత్తవాడు. శిశిరాన్ని కూడా పాపం ఇప్పుడే తొలిసారిగా చూస్తున్నాడు.

నిజానికి తనకున్న సమస్యల్లా దేన్నీ ఊహించుకోలేనితనం. జీవితం తాలూకూ భౌతిక విషయాల్లో, వస్తురూపేణా మహా చురుగ్గా, అప్రమత్తంగా వుండే ఈ మనిషికి అదేంటో వాటి పరమార్థాలు బొత్తిగా పట్టవు. మైనస్ ఏభై డిగ్రీలంటే ఎనభై డిగ్రీల మంచన్న మాటేగా. ఆ వాస్తవాలు అతనికి బాగానే తెలియజెబుతున్నాయి, మొత్తానికి చలి దుర్భరంగా, బాగా అసౌకర్యంగా ఉంటుందని. ఈ కొద్దిపాటి వేడి తనలాంటి ఒక ప్రాణికుండే బలహీనతల దిశగా ఆలోచన చెయ్యనివ్వలేదు అతన్ని. అలాని మనిషికుండే మామూలు బలహీనతవైపు కూడా. అంటే కనీసంగా భరించగల వేడిమీ, చల్లదనాల పరిమితుల గురించి కూడా. అక్కడ్నుంచి స్వర్గం గురించి ఆలోచనల దిశగానో, మనిషి తాలూకూ జీవన పరమార్థం గురించో అతన్ని ఆ ఆలోచన ముందుకెళ్ళనివ్వలేదు. మైనస్ ఏభై డిగ్రీలంటే అర్థం, చలి కొరికేస్తుందనీ, గాయపరుస్తుందనీ, దాన్నుంచి కాపాడుకోవడానికి చేతులకు తొడుగులు వాడాలనీ, చెవులు కప్పేసుకోవాలనీ, వెచ్చని మొకాసిన్లు, మందపాటి సాక్సులూ వేసుకోవాలనీ. మైనస్ ఏభై డిగ్రీలంటే అతనికి, మైనస్ ఏభై కంటే ఏమంత ఎక్కువేమీ కాదనే. దానికంటే మరీ ముఖ్య విషయం ఏమిటంటే అది అతని బుర్రలోకి ఎంతకీ చొరబడకపోవడమన్నదే అసలు విషయం.

వెళ్లడానికి ఉద్యుక్తుడైన అతడు, నోట్లో ఊరిన నీళ్ళను బలవంతంగా పుక్కిలించాలని చూశాడు. ఆశ్చర్యంగా ఉన్నపళాన ఏదో చప్పుడొచ్చింది, మళ్లీ ప్రయత్నించాడు, మళ్ళీ ఒకసారి... ఇంక ఆ నీటి బిందువులు బయటకు తుళ్ళుతూ వస్తూ, గాల్లోనే ఐస్ ముక్కలై భళ్ళున నేలమీద రాలాయి. మైనస్ ఏభై డిగ్రీలంటే అర్థం, నీళ్లు అలా నోట్లోంచి కిందవున్న మంచునేలమీద పడ్డప్పుడు చప్పుడే చేస్తాయని అతనికి తెలుసు. కానీ అవి గాల్లోనే గడ్డకట్టాయి మరి. అంటే నిస్సందేహంగా ఏభై డిగ్రీల కంటే ఇంకా తక్కువన్న మాటే, సరిగ్గా ఎంతన్నది అతడికి తెలీదు. అసలు ఉష్ణోగ్రతన్నది ఒక విషయమే కాదతనికి.

ఎక్కడైతే అతని పిల్లలు అప్పటికే అక్కడికి చేరి తనకోసం వేచిచూస్తున్నారో ఆ హేండర్సన్ వాగుదగ్గరి పాత క్యాంపు చేరడం కోసం ప్రయాణిస్తూ పోతున్నాడతడు. ఇండియన్ వాగు ప్రాంతం నుంచి కొండ మీదుగా వాళ్ళు అటుగా వచ్చి చేరారు. తను యుకాన్ ద్వీప దిగువన మంచు గడ్డలు కరిగాక నదిలో కొట్టుకొచ్చే దుంగల సాయంతో ఏమన్నా వెళ్లే అవకాశాలు ఉన్నాయేమోనన్న ఆలోచన చేసుకుంటూ ఇంత దూరం ఇటు వచ్చాడు. తను ఆ సాయంత్రం ఆరుకల్లా అక్కడుండాలి. అప్పటికి కొంచెం చీకటి పడొచ్చు. కానీ పిల్లలక్కడే వుంటారు, పొయ్యి వెలిగించి వుంటుంది, వేడి వేడి భోజనం రెడీగా ఉంటుంది. భోజనం సంగతి గుర్తురాగానే, కోటు కింద ఉన్న ప్యాకెట్టు చేత్తో తడిమి చూసుకున్నాడు. ఆ ప్యాకెట్టు తన చొక్కా కింద, రుమాల్లో చుట్టి, చర్మం వెచ్చదనాన్ని స్పృశిస్తూ తగులుతోంది. సంతృప్తిగా నవ్వుకున్నాడు తనలో తనే, ఆ రొట్టెముక్కల మధ్య అన్నింట్లో కూరిపెట్టిన కొద్దిగా పెద్దవే అయిన ఉడికిన మాంసపు ముక్కలు తలుచుకుంటూ.

పెద్ద పెద్ద పైన్ వృక్షాల తోవ వెంట చకచకా నడుస్తున్నాడు. ఇక్కడ ఆ చెట్ల జాడలు అంత స్ఫుటంగా లేవు. చివరి స్లెడ్ పోయాక చాలా అంగుళాల మందం మంచు పేరుకుపోయిందక్కడ. తనకి స్లెడ్ లేనందుకు సంతోషించాడు. నిజానికి తన దగ్గర ఆ రుమాల్లో చుట్టుకున్న ఆహారం తప్ప మరేమీ లేదు. కానీ ఆ చలి అతన్ని ఆశ్చర్యానికి గురిచేస్తోంది. అది నిశ్చయంగా చాలా ఎక్కువేనని అనుకున్నాడతను, గడ్డకట్టుకున్న చేత్తో మోహం మీదా, ముక్కు మీదా రుద్దుకుంటూ. మొహం మీద వెంట్రుకలు దట్టంగానే వున్నా అవంతగా అతని ముక్కునీ, మొహం పైభాగాన్నీ ఆ గడ్డకట్టే గాలి నుంచి కాపాడే అంతగా మాత్రం కాదు!

అతని అడుగువెంటే అడుగులు వేస్తూ అనుసరిస్తూ వస్తోంది ఓ దేశవాళీ సంతతి కుక్క. అది ఉల్ఫ్ డాగ్. ఊదారంగు ఊలుతో అడవితోడేలు కంటే పెద్దగా తేడా లేకుండా వుందది. చలి దాన్ని ఆందోళనకు గురిచేస్తోంది. దానికి తెలుసు అది ప్రయాణం చేయాల్సిన తరుణం కాదని. దాని విచక్షణ వాస్తవానికి ఆ మనిషికంటే వాస్తవానికి దగ్గరగా, మెరుగ్గా ఉంది. నిజానికి అప్పుడు ఏదో మైనస్ 50 డిగ్రీలో, 60 కంటేనో, 70 కంటేనో తక్కువ కాదు. అది 75 డిగ్రీల కంటే తక్కువే. ఎందుకంటే 32 దాటితేనే గడ్డకడుతుంది, దానర్థం 107 డిగ్రీల గడ్డకట్టే మంచది.

కుక్కకు ఉష్ణోగ్రతల లాంటివేమీ తెలియదు. మనిషి బుర్రలో ఉన్నట్టు దారుణంగా వుండే చలిని పట్టిచ్చే జ్ఞానం దానికేదీ బుర్రలో వుండదనుకుంటా. కానీ అది ప్రమాదాన్ని పసిగట్టింది. దాని భయంలో, క్యాంపుకు త్వరగా చేరడం ద్వారా గానీ, లేదంటే ఏదో

ఒక దాపున కొంచెం మంట రాజేసుకోవడం ద్వారానైనా ఆ ప్రమాదం నుంచి బయట పడాలన్న తాపత్రయమేదో కొట్టొచ్చినట్లు కనబడుతోంది. దానికి నిప్పు తెలుసు, దానికిప్పుడు దాని అవసరం కూడా తెలుసు. అదిప్పుడు ఆ మంచు గడ్డ తొలుచుకొని ఆ తీవ్రమైన గాలి నుంచి తప్పించుకునే మార్గం ఏర్పాటుచేసుకోవాల్సి వుంటుంది నిజానికి.

అది శ్వాస తీసుకునే మార్గానికిరువైపులా గడ్డకట్టిన మంచు ఫలికల తాలూకు రజను వెంట్రుకల మీద చల్లుకుపోయి వుంది. అతని మొహం మీద వెంట్రుకలపైన కూడా అలాగే మంచు రజను మరింత దట్టంగా పేరుకుపోయి వుంది. అది ఐసు గడ్డలాగా మారి, కొంచెం నోట్లోంచి వెచ్చని తేమతో కూడిన శ్వాస తగలగానే మరింతగా పెరుగుతోంది. దీనికితోడు అతని నోట్లో పొగాకు వుంది. అతని రెండు పెదాల్నీ ఐసు ఎంతగా బిగబట్టి ఉంచిందంటే, నోట్లో ఊరే ఆ రసాన్ని పుక్కిలించేందుకు కూడా వీల్లేనంత. ఫలితంగా కాసేపటికి అతని పెదాల నుండి పొడవాటి పసుపురంగు ఐసు ముక్కొకటి వేలాడుతోంది. ఒకవేళ అది కిందపడితే అది గాజుముక్కల్లా పగిలిపోవడం ఖాయం. గడ్డకట్టే చల్లో గతంలో ఇలా రెండుసార్లు పోయినప్పుడు ఇలానే జరగడం మూలాన అదలా పేరుకోవడానికి కారణం పొగాకు రసం వల్లేనన్న సోయి ఉందతనికి. కానీ చలి ఈసారి ఉన్నంత ఘోరంగా మాత్రం కాదన్నది తెలుసతనికి.

అలా ఆ అడవిని సమాంతరంగా అనుసరిస్తూ మైళ్ళకొద్దీ పోతూనే వున్నాడు. ఒడ్డు దిగి గడ్డకట్టుకుపోయిన ఒక వాగు తోవగుండా నడవడం మొదలెట్టాడు. ఇది హేండిర్సన్ వాగేననీ, ఇంకో పదిమైళ్ళ ముందు అది పాయగా చీలి ఉంటుందని కూడా తెలుసు. గడియారంవైపు చూశాడు, పదయిందప్పుడు. గంటకు నాలుగు మైళ్ళ చొప్పున నడుస్తున్నాడు. అంటే తను పదకొండున్నరకి ఆ చీలినపాయ దగ్గరికి చేరతాడు. చేరగానే తను భోజనం చేస్తానని అనుకున్నాడు.

ఆ మనిషి ఆ గడ్డకట్టిన వాగు తోవవెంటే నడవడం మొదలెట్టగానే, తోక కిందికి జార్చి ఆ కుక్క అతన్ని అనుసరిస్తూ అతని అడుగుల వెంటే వెంబడించింది. మునుపటి స్లెడ్ తాలూకు గీతల ఆనవాళ్లు కనబడుతున్నాయి. కాకపోతే ఒక దజను అంగుళాల మందం మంచు పేరుకుంది వాటిమీద. ఒక మాసంగా ఆ నిశ్శబ్దపు వాగు మీదుగా ఇటుగానీ, అటుగానీ ఎవ్వరూ ప్రయాణం చేసిన దాఖలాల్లేవు. నేరుగా నిబ్బరంగా వెళుతూనే ఉన్నాడా మనిషి. పెద్ద ఆలోచనాపరుడు కాదతడు. అస్సలప్పుడు ఆలోచించడానికేముంది గనక, మహా అయితే ఆ వాగుపాయ చేరుకోగానే ఇంత తినడం గురించీ, ఆరు గంటలకల్లా క్యాంపులో పిల్లలతో ఉండటం గురించీ తప్ప. మాట్లాడ్డానికి మాత్రం

ఎవరున్నారు గనక, ఒకవేళ వున్నా నోట్లోంచి మాట పెగిలివచ్చే దారేలేదు, ఐసుతో బిగుసుకున్న తన మూతిలో నుంచి.

కాసేపటికొకసారి పదే పదే తనకొక ఆలోచన తడుతోంది.. బాగా చలిగా, మును పెన్నడూ లేనంతగా ఉందన్న విషయం. నడుస్తూనే మధ్య మధ్యలో అలా అంతగా మనసు పెట్టకుండా చేతితొడుగుల వెనకభాగంతో ముక్కూ, మొహం రుద్దుకుంటున్నాడు. తరచుగా చేతులు మార్చి మార్చి రుద్దుకుంటూ పోతున్నాడు. ఈ రుద్దుడు ఎప్పుడైతే ఆగిపోయిందో అప్పుడర్థమైందతనికి, తన మొహమూ, ముక్కూ మొద్దుబారినట్టు. మొహమైతే నిశ్చయంగా గడ్డకట్టుకుపోయిందని తెలుస్తోంది. ముక్కుకు చలినుంచి కాపాడేందుకు తగిలించుకోవాల్సిన ఆచ్ఛాదన తను పెట్టుకోలేదన్న విషయం తనికి తెలియకపోలేదు. ఇప్పుడు బాధపడీ చేసేది మాత్రం ఏముంది గనక. అదైతే ముక్కుమీదుగా మొహం మొత్తాన్ని కప్పేస్తుంది. కానీ అదొక విషయమే కాదు తనకి అనుకున్నాడతడు. ఈ కొంచెం మంచు ఏం చేస్తుంది? కొంచెం నొప్పి అంతేగా. ఎప్పుడూ పెద్దగా తీవ్రమైంది లేదు.

తన బుర్రలో మరే ఆలోచనలు లేకుండా శూన్యమైనప్పుడు, మనిషి తనప్పుడు స్ఫురద్రూపిగా అయిపోతాడు. వాగునడకలో, వంపులో, వలయాల్లో మార్పుల్ని సునిశితంగా పరిశీలించి చూస్తూ వస్తున్నాడు. ఎక్కడ అడుగేస్తున్నాడో గమనిస్తూ వేస్తున్నాడు. ఇంతలోనే ఒక మలుపు పక్కకి తిరిగి బెదిరిన గుఱ్ఱంలా తటాలన ఆగాడు. నడుస్తున్న తోవనుంచి కొంచెం ఎడంగా వెనక్కి జరిగి మలుపు తిరిగి, అదే తోవవెంట నడుస్తూ పోయాడు కొంచెంసేపు. ఆ వాగు అడుగంటా గడ్డకట్టింది. అంత చలికాలంలో ఏ వాగులో నీళ్లుండవు. అయితే కొండల జాలులో పారే వాగులూ, వంకలూ గడ్డకట్టిన మంచునేల కిందనుంచీ, ఒకోసారి పైనుంచి కూడా పారడం తెలుసు తనకి. అంతేకాదు అవి ఘోరమైన చలికి కూడా గడ్డకట్టవనీ, అవి ప్రమాదం కూడాననీ తెలుసు. మూడు అంగుళాల లోతులోనో, లేదంటే మూడు అడుగుల లోతులోనో, ఆ గడ్డకట్టిన మంచునేల నీటిగుంటల్ని దానికింద దాచిపెట్టుకొని ఉంటుందనీ తెలుసు. ఒకోచోట ఈ మంచు పొర అరంగుళం మందం మంచు కప్పేసుకుని ఉంటుంది. కొన్నిసార్లు ఆ నీళ్లతో పాటూ, పల్చటి ఐసూ కూడా కలిసి వుండి, ఎవరన్నా జారి పడ్డప్పుడు ఇంక మొత్తం తడిచిపోవడం ఖాయం.

అందుకే తను ప్రమాదాన్ని శంకించి ఒక్క ఉదుటున పక్కకి గెంతాడు. తన కాళ్ల కింద మంచుగడ్డ కదలడం గమనించాడు, ఐసు గడ్డ పొర చిట్లుతున్న ధ్వని కూడా విన్నాడు. అలాంటి ఉష్ణోగ్రతలో తన కాళ్ళు నీళ్లలో తడవడం ప్రమాదం. ఒకవేళ తను మంట తయారుచేసుకొని, కాసేపు ఆగాల్సివస్తే గనక మహా అయితే ఆలస్యం అవుతుంది,

అంతేగదా. అలాగైతేనే తను ఆ మేజోళ్ళనీ, మొకాసిన్లనీ కాస్త వేడి చూపించి పొడిబారేదాకా చేసి తన పాదాల్ని కాపాడుకోగలుగుతానని అనుకున్నాడు.

కాసేపు అలా నుంచుని వాగు అడుగునీ, ఒడ్డునీ బాగా పరిశీలనగా చూశాడు. పారే ఆ వాగు తాలూకు మూలం కుడివైపు నుంచని అర్థం చేసుకున్నాడు. కాసేపు ముక్కూ మొహం రుద్దుకుంటూ ఆలోచనలో పడ్డాడు. ఎడంవైపు నడిచాడు. ప్రతి అడుగునీ అప్రమత్తంగా వేస్తూ జాగ్రత్తగా నడవడం మొదలెట్టాడు. ప్రమాదం దాటిపోయిందనుకున్నాక మళ్ళీ తన నాలుగు మైళ్ళ వేగం అందుకున్నాడు.

మరో రెండు గంటల నడకలో ఎన్నోసార్లు అట్లాంటి చిక్కులెదురొచ్చాయి. సాధారణంగా నీళ్ల గుంటలపైన పేరుకునే మంచు కొంచెం చూట్టానికి కుంగి వుంటుంది. అయినాసరే, ఇంకోసారి గుంటలో కూరుకుపోయే పరిస్థితి రానే వచ్చింది. ప్రమాదం పసిగట్టిన అతను ఒకసారి ముందు కుక్కని వెళ్ళమని చెప్పాడు. కుక్క ససేమిరా అంది. ఆ మనిషి దాన్ని వెనకనుంచి ముందుకి తోస్తే తప్ప కదల్లేదది. అదప్పుడు చకచకా అడుగులు వేస్తూ ఆ తెల్లని పగుళ్ళులేని మంచుగడ్డల మీదనుంచి ముందుకెళ్లింది. కానీ పాపం అది హఠాత్తుగా జారి గుంటలోకి పడిపోయింది. కానీ వెంటనే తెప్పరిల్లి, కాస్త గట్టిగా ఉన్నవైపు నుంచి పైకి ఎగబాక గలిగింది. దాని పాదాలూ, కాళ్లు నీళ్లలో నానిపోయాయి. చూస్తుండగానే క్షణాలలో అవి గడ్డకట్టుకుపోయాయి. అది ఆ గడ్డకట్టిన ఐసుని విదిలించుకునేందుకు నానా హైరానా పడుతోంది. ఆ మంచు గడ్డమీదే పడుకొని దాని కాలి పంజాల మధ్య ఇరుక్కున్న ముక్కల్ని పంటితో కొరికేసి విదల్చడం మొదలు పెట్టింది. జంతువుగా దానికి ఇది బాగానే తెలుసు. ఐసు అలా వదిలేయడం అంటే పాదాల్ని గాయపెట్టడమేనన్న విషయం మాత్రం దానికి తెలియదు. అది దాని అంతరాల లోతుల్లోంచి వెలికివచ్చిన సూచనల్ని మాత్రమే అనుసరించే ప్రయత్నం చేసింది.

కానీ ఆ మనిషికి తెలుసు ఇవన్నీ, అనుభవపూర్వకంగా నేర్చుకొచ్చాడు కాబట్టి. కుడిచేతి తొడుగు లాగేసి కుక్కకి ఆ ఐసుని దులపరించడంలో సాయమందించాడు. ఒక్క నిమిషం కంటే ఎక్కువ భరించలేకపోయాయి అతని వేళ్ళు. ఇంకా ఆశ్చర్యంగా అవి మొద్దుబారిపోయి వున్నాయి. అవును చలి ఘోరంగా ఉంది. గభాల్న చేతితొడుగు లాగేసి చేతిని ఛాతీ మీద టపటపా కొట్టుకున్నాడు. పన్నెండు అయ్యేటప్పటికి వచ్చిన ఆ వెలుతురు ఇకది ఆ రోజుకి గొప్ప వెలుగు అన్నట్టే. నిజానికి ఇంక సూర్యుడు ఆకాశంలో లేనే లేడప్పటికి. సరిగ్గా పన్నెండున్నరకి వాగు చీలిపోయే చోటుకు చేరాడు. తన వేగానికి

సంతోషపడ్డాడు. అలానే కొనసాగితే తను కచ్చితంగా పిల్లల దగ్గరకు ఆ సాయంత్రం ఆరింటికల్లా చేరడం ఖాయమనుకున్నాడు.

పై కోటు జాకెట్టు తీసి, చొక్కా బొత్తాలు విప్పి ఎంగిలిపడటానికి సిద్ధమయ్యాడు. నిమిషంలో నాలుగోవంతు సమయం కాకముందే ఆ పనిచేసినా, ఆ కొద్ది క్షణాలలోనే ఆచ్ఛాదన లేని వేళ్ళకు స్పర్శపోయి మొద్దుబారడం గమనించాడు. చేతి తొడుగు పెట్టుకోకుండా వేళ్ళని కాళ్ళకేసి కొట్టాడు కాసేపు. ఇంక అక్కడే ఉన్న మంచు పేరుకున్న ఒక దుంగమీద కూచొని తిండి తిందామని ఉపక్రమించాడు. వేళ్ళని కాలికేసి కొట్టుకున్న నొప్పి చిటికెలో మాయమవడంతో అతనికి భయం వేసింది. ఒక ముద్ద నోట్లో పెట్టుకునే సమయం కూడా లేకపోయింది. పదేపదే చేతులు కాళ్లకేసి కొట్టుకుంటూ మళ్ళా వేళ్ళని తొడుగులో దూర్చుకుంటున్నాడు. ఇంకో చేత్తో తినడానికి ప్రయత్నం చేశాడు. ఒక ముద్ద నోట్లో పెడదామనుకున్నాడు, కానీ మూతి చుట్టూ బిగుసుకున్న మంచుగడ్డ నోటిని తెరుచుకోనివ్వలేదు.

ఎక్కడ తప్పు జరిగిపోయిందో అర్థమవుతుంది. ఇంత నిప్పు రాజేసుకొని వళ్ళు వెచ్చజేసుకోవడం మరిచాడు. తన మూర్ఖత్వానికి తనే నవ్వుకున్నాడు. నవ్వుకుంటుండగానే, పైనేమీ కప్పుకోని వేళ్ళలో పాకుతున్న బండతనం గుర్తించాడు. ఇంకా, తను దుంగమీద కూచున్నప్పుడు కాలి వేళ్లలో తొలిసారిగా గమనించిన స్పర్శ అప్పటికే పోవడమూ గమనించాడు. అసలవి వెచ్చగా ఉన్నాయో, బండబారిపోయాయో తెలుసుకోవా లనిపించింది. మొకాసిన్ల లోపలికి కాలివేళ్లని ముడుచుకునే ప్రయత్నం చేశాడు. కానీ అవి మొద్దుబారడం చూశాడు.

గభాల్న చేతితొడుగు లాక్కొని నిలబడ్డాడు. ఒకింత భయపడ్డాడు కూడా. బలంగా కాళ్ళని నేలమీద గట్టిగా మళ్లీ స్పర్శ వెనక్కి వచ్చేవరకూ మోదాడు. చలి ఘోరంగా ఉందని మాత్రం అనుకున్నాడు మళ్ళీ. ఆ గంధకపు వాగు పెద్దమనిషి నిజమే చెప్పాడు. ఈ ప్రాంతపు గడ్డకట్టే చలి గురించి చెప్పినప్పుడు ఒకోసారి అదెంత ఘోరంగా ఉంటుందో ఇప్పుడు తెలిసొచ్చింది. అప్పుడేమో అతన్ని చూసి నవ్వాడు తను. అందుకే ఏ విషయమైనా రూఢిగా తెలుసని అనుకోకూడదని అతను అనుకున్నాడు. సంశయించాల్సింది అందులో ఏం లేదు, నిజంగానే చల్లగా వుంది. కొన్ని అడుగులు ముందుకేశాడు, గట్టిగా కాళ్ళని నేలకు కొడుతూ, చేతులు బాగా ఝాడిస్తూ మళ్లీ వెచ్చదనాన్ని పొందేవరకూ అలా చేశాడు. ఇంక అప్పుడనుకున్నాడు తను, కాసిన్ని అగ్గిపుల్లలు గీసి నిప్పు రాజేసే పన్లో పడాలని. ఆ పొదల్లో నీటిపొంగు మోసుకొచ్చి వదిలేసిన కట్టెపుల్లలున్నాయి.

వాటిల్లోంచి పుల్లలు దొరకబుచ్చుకున్నాడు మంట చెయ్యడానికి. కొద్ది మంటతో మొదలుపెట్టి జాగ్రత్తగా దాన్ని సెగలుగక్కే మంటగా రగిలించాడు.

మంట మీదకి వొంగి ముందుగా మొహం మీది మంచుని కరిగించుకున్నాడు. ఆ వెచ్చదనాన్ని కాచుకుంటూ ఎలానో ఇంత తిన్నాడు. మొత్తానికి ఆ కాసేపు చలిని దగ్గరికి రాకుండా తోసేయడం జరిగింది. కుక్క కూడా ఆ వెచ్చదనంలో ఒకింత మంటకి చేరువగా, వళ్లు కాలనంత దూరంగా శరీరాన్ని చాపి పడుకొని వేడి అందుకుంది. అన్నం తినడం పూర్తయ్యాక, పైపులో పొగాకు కూరుకొని కాసేపలా దమ్ము పీల్చుకుంటూ కొద్దిసేపు సేదదీరాడు. చేతులమీదకి తొడుగులు పైకంటా లాక్కొని, చెవులకు పైగా టోపీ బిగించుకుని, మెల్లగా వాగువెంట ఎడమవైపుకి నడవడం ప్రారంభించాడు.

మంట వొదిలేసి రావడం సుతరామూ ఇష్టంలేని కుక్క అలా మంటవైపే చూస్తోంది. ఈ మనిషికసలు చలి తెలీదనుకుంటా. బహుశా ఈ మనిషి పూర్వీకులకు కూడా ఎవరికీ చలంటే తెలిసినట్టు లేదు, నిజమైన చలేదో. కానీ కుక్కకు బాగా తెలుసు, దాని సంతతికి కూడా బాగా తెలుసు. అంత భయంకరమైన చల్లో అలా బయట నడవడం మంచిది కాదన్నది తెలుసు దానికి. నిజానికి అలాంటి సమయంలో మంచులో బొరియ చేసుకుని దూరిపోయి, ఆ భయంకరమైన ఈదురుగాలి విసురు తగ్గేదాకా వేచిచూడాలి. నిజానికి ఆ మనిషికీ, ఆ కుక్కకీ మధ్య బంధం అంత బలమైందేమీ కాదు. అతనికి అదొక బానిస మాత్రమే. తన భయాన్ని ఆ మనిషికి చెప్పే ప్రయత్నమేమీ చేయలేదది. అలాని అది ఆ మనిషి బాగోగుల పట్ల అంతగా శ్రద్ధ పెట్టేదీ లేదు. అది దాని జాగ్రత్త కోసం ఆ మంట వైపు చూసిందంతే. కానీ ఆ మనిషి ఈలవేస్తూ దాన్ని సిద్ధంకమ్మన్నట్టు గొంతుతో ఆజ్ఞాపూర్వక సందేశం పంపాడు. ఇంక కుక్క ఆ తోవవెంబడి, ఆ వ్యక్తి అడుగుల్ని దగ్గరగా అనుసరిస్తూ నడవడం మొదలుపెట్టింది అతని వెంటే.

మరింత పొగాకు నోట్లో దట్టించుకున్న ఆ మనిషి నోట్లోంచి మళ్లీ పసుపు రంగు ఐసు మొహం మీదకు తాజాగా పాకుతోంది. మళ్లీ తేమతో ఉన్న అతని ఊపిరి వెంటనే అతని మొహంమీది వెంట్రుకల్ని తెల్లటి పొడిగా మార్చేసింది. చుట్టూ కలయదిరిగి చూశాడు. హేండిర్సన్ వాగు ఎడమవైపు తోవ వెంట మంచుగడ్డల కింద ఆట్టే నీటి చెలమలు వున్నట్లుగా లేవు. మరో అరగంటపాటు వాటి జాడలు లేనట్టే అనుకున్నాడు.

అప్పుడు జరిగిందది. కూజాడ కూడా పసిగట్టలేని ఒక గుంటలో ఆ మనిషి జర్రున పడిపోయాడు. ఆట్టే లోతు లేదు. గట్టి మంచునేల మీదికి ఎక్కేలోపే అతని కాళ్ళు మోకాళ్ల లోతు వరకూ తడిచేపోయాయి.

తన దురదృష్టానికి తనే బిగ్గరగా శాపనార్థాలు పెట్టుకున్నాడు ఆగ్రహంతో. ఆరింటికల్లా పిల్లలతో క్యాంపులో ఎట్టి పరిస్థితుల్లో అయినా ఉండాలని ఆశించాడు, కానీ దీనివల్ల ఇంకొక గంట ఆలస్యం. మళ్లీ మంట రాజేసి ఈ తొడుగుల్నీ, మేజోళ్ళనీ వెచ్చజూపితే తప్ప గత్యంతరం లేని స్థితి. ఇది ఈ దారుణంగా వున్న వాతావరణంలో చాలా ముఖ్యం. అదతనికి బాగా తెలుసు. మళ్లీ వొడ్డువైపు, ఇంచుమించు ఎక్కుకుంటూనే చేరుకున్నాడు. ఆ పైన, చిన్న చిన్న పైన్ చెట్ల మధ్య మునుపటేడాది నీటిపొంగుకు కొట్టుకొచ్చిన కట్టెలు కొన్ని కంటబడ్డాయి. పుల్లలే కాదు, కొద్దిగా పెద్ద కొమ్మలూ, ఎండు గడ్డీ కూడా వుందక్కడ. ఆ పెద్ద కొమ్మల్లో చాలావాటిని ముందుగా ఆ మంచుగడ్డల మీదికి విసిరాడు. అది ఆ మంచులో లేత మంటని చంపేయకుండా ఉండేందుకు ఒక దన్నులా అడ్డొస్తుంది అనుకున్నాడు. జేబులోంచి ఒక చిన్న బెరడు ముక్క తీసి, ఆ ముక్కమీద అగ్గిపుల్ల గీసి, మెల్లగా అగ్గి రాజేశాడు. అది కాగితం కంటే బాగా అంటుకుంది. దాన్ని ఆ దన్ను మీద పెట్టి, ఎండుగడ్డి తగిలించి, చిన్న చిదుగులు పేర్చుకుంటూ ఆ మంటని పెద్దదిగా చేశాడు.

తనున్న ప్రమాద తీవ్రతని గ్రహించిన అతడు మెల్లగా, చాలా జాగ్రత్తగా పనిచేయడం మొదలుపెట్టాడు. క్రమంగా మంట అందుకొని పెద్దగా అవుతోన్న సమయంలో మరిన్ని పుల్లల్ని తగిలిస్తూ మంటని ఇంకా పెంచుకుంటూ పోయాడు. మంచుగడ్డ మీద కూచొని, చెట్లకింది తుప్పల్లో పుల్లల్ని ఏరుకొచ్చి నేరుగా వాటిని మంటలోకి తోస్తున్నాడు. తను ఎట్టి పరిస్థితుల్లోనూ విఫలం కాకూడదనుకున్నాడు. మైనస్ 75 డిగ్రీలలో ఉన్న మనిషి నిప్పు చేసే తొలి ప్రయత్నం అస్సలు తప్పకూడదు. తన పాదాలు తడిచి వున్నప్పుడైతే ఇది మరీ నిజం. కాళ్ళు పొడిబారి ఉన్నప్పుడైతే, ఒకవేళ తనాపని చేయలేకపోతే, ఒక అరగంటపాటు పరుగెత్తి కాస్తా నెత్తురు పుంజుకునేదాకా పరవాలేదు. మైనస్ 75 డిగ్రీల్లో కాళ్ళు తడిచి, గడ్డగట్టిపోయి ఉన్న సమయంలో పరుగెత్తి రక్తంలో కదలిక ఆశించడం అసాధ్యం. ఎంత వేగంగా పరుగు లంకించుకున్నా, తడిచిపోయిన పాదాలు మరింత గడ్డకడతాయే తప్ప ఫలితం ఉండదు.

ఇవన్నీ ఆ మనిషికి తెలుసు. గంధకపు వాగు పెద్దాయన ఇవన్నీ ఈ మనిషికి చెప్పాడు. అందుకు ఇప్పుడు అతనికి ధన్యవాదాలు చెప్పుకోవాలి. ఇప్పటికే పాదాల్లో స్పర్శ పూర్తిగా పోయింది. నిప్పు రాజేయడం కోసం తప్పనిసరిగా తొడుగులు విప్పడం మూలాన వేళ్ళు క్షణాల్లోనే గడ్డకట్టి మొద్దుబారాయి. గంటకి నాలుగు మైళ్ల వేగపు నడక వల్ల అతని గుండె అతని అన్ని అవయవాలకీ అంతో ఇంతో రక్తం పంపు చేసింది. ఎప్పుడైతే ఆగిపోయాడో గుండె పనితీరు నెమ్మదించింది. ఇప్పుడు చలి ఉధృతి మళ్లీ

తాకింది అతన్ని. శరీరంలోని నెత్తురు వెనక్కు వెళ్ళిపోయింది మళ్ళీ. నెత్తురు కుక్కకి మల్లే బతికే వుంది. నెత్తురు కుక్కకి మల్లే ఎక్కడైనా దాక్కుని ఆ భయంకరమైన చలి నుండి నక్కిపోవాలనుకుంది. నాలుగు మైళ్ల వేగపు నడక పుణ్యమాని అతడు నడిచినంత సేపూ నెత్తురు ఉపరితలం మీదికి ఉబికివచ్చేది. కానీ ఇప్పుడది శరీరం లోలోతుల్లోకి దిగజారి పోయింది. అన్నిటికంటే ముందు ఆ ప్రభావానికి గురైంది అతని చేతులూ, పాదాలూను. ముందుగా అతని తడిచి కొయ్యబారిన చేతులు గడ్డకట్టాయి, ఆచ్ఛాదనలేని వేళ్ళు ఇంకా పూర్తిగా గడ్డకట్టుకోకపోయినా మొద్దుబారాయి. ముక్కూ, మొహం అప్పటికే గడ్డకట్టేశాయి. యావత్తూ చర్మం రక్తవిహీనమై చల్లబడిపోయింది.

కానీ తను క్షేమంగానే ఉన్నాడు. కాలి వేళ్ళు, ముక్కూ మొహానికి మాత్రమే చలి తాకుతోంది, ఎందుకంటే మంట మరింతగా శక్తి పుంజుకుని మండటం మొదలుపెట్టింది. తన వేలంత లావున్న పుల్లల్ని ఒక్కోటే మంటకి అందిస్తున్నాడు. మరునిమిషంలో ఇంకా పెద్ద పెద్ద మండల్ని పెట్టే విధంగా చూసుకున్నాడు. అటుపై తడిచిన చేతి తొడుగుల్నీ, మేజోళ్ళనీ తియ్యొచ్చు. అవి వెచ్చబడి పొడిబారేలోగా తను తన ఆచ్ఛాదనలేని అరికాళ్ళని ముందు కొంచెం మంచుతో రుద్దుకున్నాక కాస్తా వేడి చూపించుకోవచ్చు. మంట ఒక విజయం. తను క్షేమంగా వున్నాడు.

గంధకపువాగు పెద్దాయన సలహా గుర్తుకొచ్చి నవ్వుకున్నాడు. తోడులేకుండా ఎవరైనా మైనస్ 50 డిగ్రీలు దాటాక ఒంటరిగా అట్లాంటి ప్రాంతంలో పోవడం విషయమై ఆ మనిషి చాలా తీవ్రంగానే చెప్పాడు. చివరికి ఇదిగో వీడిక్కడ! ప్రమాదం కాచుకున్నాడు, వంటరిగా వున్నాడు, ఎలానో తన్ని తాను క్షేమంగా రక్షించుకున్నాడు.

ఆ ముసలోళ్ళంతా కొంచెం ఆడతనంతో ఉన్నారేమో అనుకున్నాడు. మనిషన్నవాడు కొంచెం బుర్ర ఉపయోగిస్తే చాలు అన్నీ సర్దుకుపోతాయ్. ఎవడైనా సరే మనిషైనవాడు ఒంటరిగానే ప్రయాణం చేయాలి. కానీ ఎందుకంత వేగంగా తన ముక్కూ, మొహం గడ్డకట్టుకుపోతున్నాయో మాత్రం అతన్ని ఆశ్చర్యానికి గురిచేస్తోంది. అంత త్వరగా తన వేళ్ళు మొద్దుబారడం ఎందుకనేది ఆలోచించలేకపోతున్నాడు. వాటినతడు అతికష్టం మీద ఒకదగ్గరికి చేర్చి పుల్ల కూడా సరిగ్గా పట్టుకోలేకపోతున్నాడెందుకు. అవి తనకీ, తన శరీరానికీ సంబంధమే లేనట్టుగా అయిపోయాయి మరి. పుల్ల పట్టుకున్నప్పుడు తను నిజంగానే దాన్ని పట్టుకున్నాడో లేదో చూడాల్సివస్తోంది.

కానీ ఇవన్నీ ఆట్టే పట్టించుకోవాల్సిన విషయాలు కాదు. ఎదురుగా నిప్పుంది, ఆ నృత్యం చేస్తున్న మంట ప్రాణం ఇస్తుంది. మొకాసిన్లు విప్పుకోవడం మొదలుపెట్టాడు.

అవి అప్పటికే మంచుతో పేరుకుపోయాయ్. మేజోళ్ళు ఇనుప తొడుగుల్లాగా మోకాళ్ల వరకూ బిగుసుకున్నాయ్. మొకాసిన్ల లేసులు స్టీలు తీగల మాదిరిగా మారాయి. స్పర్శ లేని వేళ్లతో వాటిని లాగాలని ప్రయత్నించాడు. అదెంత మూర్ఖత్వమో గ్రహించి కత్తి తీశాడు.

ఇంక తాళ్ళు తెంపకముందే అది జరిగింది. తన స్వయంకృతం వల్లో, లేదంటే ఏదో పొరపాటువల్లో అది జరిగింది. నిజానికి అతడు పైన్ చెట్టుకింద మంటపెట్టి వుండాల్సింది కాదు. ఎక్కడైనా బాహ్య ప్రదేశంలో పెడితే బాగుండేది. పైన్ చెట్టుకిందైతే పొదల్లో పుల్లలులాగి నేరుగా అంటించడం సులువు కదా అని మాత్రమే అనుకున్నాడు.

తనెక్కడ మంట రాజేశాడో ఆ పైన్ చెట్టు దాని నెత్తిన మంచుభారాన్ని భారీగా మోస్తోంది. వారాల తరబడి గాలి వీయకపోవడంతో అదలా కుదపలుగా ప్రతి కొమ్మమీదా భారీగా పేరుకుపోయింది. మంట లాగిన ప్రతీసారీ ఆ చెట్టుని అంతో ఇంతో అతడు కదుపుతూ వచ్చాడు. ఘోరం జరిగిపోవడానికి ఆపాటి కదలిక చాలు. ఎత్తున మంచు బరువెత్తుకుని ఉన్న ఒక కొమ్మ ఒక్కసారిగా తన బరువుని విదిలించుకుంది. అది దానికి దిగువున ఉన్న కొమ్మలపై భారం మోపింది. అలా ఆ ప్రక్రియ కొనసాగి కొనసాగి చెట్టంతా అందుకుంది. ఎటువంటి ప్రమాద హెచ్చరిక చేయకుండానే ఉన్నఫళాన ఆ మనిషి మీదా, ఆ మంట మీదా కుప్పకూలడంతో మంట చల్లారిపోయింది. అప్పటిదాకా మండినచోట్లో ఇప్పుడు తాజా మంచు కుప్పగా పోసివుంది.

ఆ మనిషి ఒక్కసారిగా భీతిల్లిపోయాడు. అది తన మరణ శాసనం విన్నట్టుగా వుంది. క్షణకాలం చేష్టలుడిగి అలా ఆ మంట చేసిన చోట కూచుండిపోయాడు. కొంచెం తేటపడ్డాడు మెల్లగా.  బహుశా ఆ గంధకపు ముసలాయన చెప్పింది రైటే అనుకున్నాడు.

తనవెంట దారిపొడుగునా ఒకరు తోడొచ్చి వుంటే ఈ ప్రమాదం ఎదురయ్యేది కాదు గదా అనుకున్నాడు. తోడొచ్చిన ఆ మనిషి ఇలాంటప్పుడు నిప్పురాజేసి ఉండేవాడు కదా అనుకున్నాడు. ఇప్పుడు తనే మళ్ళీ నిప్పు రాజేయాలి, పైగా ఈ రెండోసారి అస్సలు విఫలం కాకూడదు. సఫలమైనా తను కొన్ని కాళ్ల వేళ్ళు పోగొట్టుకోవాల్సిన పరిస్థితే వుండొచ్చు. ఇప్పటికే పాదాలు తీవ్రంగానే మొద్దుబారిపోయి ఉండాలి, ఇంకా రెండోసారి మంట అందుకునే సమయానికి మరింతగా కూడానూ.

అవీ అతని ఆలోచనలు. అలాని అతడు తీరుబడిగా కూచుని ఆలోచించడం లేదు. అలా ఆలోచనలో కొట్టుకుపోతూ కూడా మరోవైపు చేయాల్సిన పని చురుగ్గా చేస్తూ పోతూనే ఉన్నాడు. మళ్ళీ నిప్పు రాజేయడానికి ఒకచోట రంగం సిద్ధం చేసుకున్నాడు,

కాకపోతే ఈసారి పైన ఎక్కడా చెట్టులేని బాహ్య ప్రదేశంలో. తర్వాత కొంచెం ఎండుగడ్డి పరకల్ని, కాసిన్ని చిన్న పుల్లల్ని పోగేశాడు. వాటిని నేల్లోంచి తన వేళ్లతో పట్టి లాగలేక పోయినా మొత్తానికి చేతి నిండుగా పోగేసుకోగలిగాడు. వాటిల్లో చాలానే పనికిమాలినవి చేరినా ఇంతకుమించి ఏం చేయలేకపోయాడు. మంట పెద్దయ్యాక ఉపయోగించుకోవాలన్న తలంపుతో చేతికందిన కొన్ని పెద్ద మండల్ని కూడా ముందుజాగ్రత్తగా లాక్కొచ్చి పెట్టుకున్నాడు. అంతసేపూ కుక్క అతన్ని అలా గమనిస్తూ చూస్తుండిపోయింది. దాని కళ్లలో ఆందోళన వుంది. నిప్పుచేసిపెట్టే ఆ వ్యక్తి మీదే ఆధారం దానికి, అదేమో మెల్లిగా జరుగుతోంది మరి.

ఇంక అంతా సిద్ధమయ్యాక, రెండో చెట్టు బెరడు ముక్క కోసం జేబులో చెయ్యి దూర్చాడు. వేళ్ళకి స్పర్శ తగలకపోయినా, బెరడు జేబులో ఉందని మాత్రం తెలుసు.

మళ్ళీ మళ్ళీ తడుముతున్నాడు, కానీ పట్టుకోలేకపోతున్నాడు. అదే సమయంలో మరోవైపు తన బుర్రలో తన పాదాలు గడ్డకట్టుకుపోతున్న స్పృహ కూడా వుంది. ఆ ఆలోచన అతన్ని హెచ్చరిస్తోంది. అయినా దాన్ని లక్ష్యపెట్టకుండా ప్రశాంతంగా వుండేలా పోరాడుతున్నాడు.

పళ్లతో చేతితొడుగుల్ని లాగేసుకుని చేతుల్ని ఊపడం మొదలుపెట్టాడు. ఇరువైపులా వాటిని శరీరానికి గట్టిగా కొట్టుకోవడం మొదలుపెట్టాడు. కూచునే ఇదంతా చేస్తున్నాడు. నిలబడి కూడా ప్రయత్నం చేద్దామనుకున్నాడు. అంతసేపూ కుక్క, సూటిగా మొనదేలివున్న దాని తోడేలు చెవుల్ని ముందుకు దించి, తోకని వెచ్చగా దాని పాదాలకి చుట్టిపెట్టుకుని, తదేకంగా అతన్ని చూస్తూనే కూచుండిపోయింది ఆ మంచులో. ప్రకృతిచ్చిన వెచ్చని భరోసా కవచాన్ని కప్పుకొని నిబ్బరంగా ఉన్న ఆ ప్రాణివైపు ఆ మనిషి ఒకవైపు చేతులు ఊపుకుంటూనే ఆబగా చూస్తున్నాడు.

కాసేపటికి, కొట్టుకున్న చేతివేళ్ళలోకి కొంచెం చైతన్యం వచ్చినట్టు అనిపించింది. ఆ చైతన్యం పెరుగుతున్నప్పుడు బాగా నొప్పిగా అనిపించినా ఆ నొప్పిని స్వాగతించాడా వ్యక్తి. కుడిచేతి తొడుగు లాగేసి మళ్లీ జేబులో చెయ్యి జొనిపి బెరడు పట్టుకొని తీశాడు. ఆచ్ఛాదన లేని వేళ్ళు మళ్ళీ చిటికెలో మొద్దుబారాయి. తర్వాత అగ్గిపుల్లల పెట్టె లాగాడు. అప్పటికే ఆ చేతి వేళ్ళలో ఉన్న ప్రాణాన్ని ఆ భీకర చలిగాలి హరించుకుపోయింది. మిగతా పుల్లల నుంచి ఒక పుల్ల వేరుచేసి తీసి వెలిగించాలనే ప్రయత్నంలో పట్టుచిక్కని వేళ్లనుంచి జారి మొత్తం పెట్టె క్రింద మంచులో పడిపోయింది. ఆ మంచులోనుంచి

తీయడానికి విశ్వప్రయత్నం చేశాడు, కానీ తనవల్ల కాలేదు. నిస్తేజమైన ఆ వేళ్ళు దాన్ని తాకనూ లేదు, పట్టుకోనూ లేదు.

ఇప్పుడింక మరింత అప్రమత్తమయ్యాడు. తన ముక్కూ, మొహమూ, పాదాలూ గడ్డగట్టుకుపోతున్నాయన్న ఆలోచనని మనసులో నుంచి తరిమేశాడు. మనసంతా అగ్గిపెట్టెని గాలించడం మీద లగ్నం చేశాడు. చేతి వేళ్ళ కదలికల వెంటే దృష్టి సారిస్తూ, స్పర్శ కంటే చూపుకు ఎక్కువ ప్రాధాన్యతనిచ్చి గాలిస్తున్నాడు. ఎప్పుడైతే పెట్టెకి ఇరువైపులా వేళ్ళు కనబడ్డాయో వెంటనే దగ్గరకు మూసేశాడు. వేళ్ళు సహకరించడం లేదని తెలిశాక ఇక చేతుల్ని మూయడం ద్వారా పట్టుకోవాలనుకున్నాడు. మళ్ళీ కుడిచేతి తొడుగు తగిలించుకుని చేతిని మోకాలిమీద భీకరంగా బాదేసుకున్నాడు. తరువాత తొడుగులు తగిలించుకున్న రెండు చేతుల్లోకి బాగా మంచు పేరుకున్న అగ్గిపెట్టెను తీసుకొని పైకోటు జాకెట్టు వరకూ పైకెత్తాడు. పెద్దగా దానివల్ల ఒరిగిందేమీ లేదతనికి.

ఎంతో భీకర ప్రయత్నం చేశాక ఎప్పటికో రెండు తొడుగుల మధ్య చేతుల్లోకి అగ్గిపెట్టెని తేగలిగాడు. అదే రీతిలో మరికొంత ప్రయత్నంతో నోటిదాకా తెచ్చుకున్నాడు. గట్టి ప్రయత్నంతో నోరు తెరవడంతో మొహంమీది మంచు ఫలిక చిట్లి భళ్ళున నోరు తెరుచుకుంది. పైపళ్లని ఉపయోగించి గట్టిగా రుద్ది, పెట్టెలోంచి ఒకపుల్ల వేరుచేయడానికి శ్రమించాడు. ఎలానో అతి కష్టంమీద ఒకదాన్ని పట్టుకున్నా అది కోటు జాకెట్ మీదకి జారిపోయింది. పరిస్థితి ఏమాత్రం మెరుగవుతున్నట్టు లేదు. అగ్గిపుల్ల పట్టలేకపోతున్నాడు. ఎలా పట్టుకోవాలా అని మథన పడుతున్నాడు. పంటి మధ్య పుల్ల ఇరికించుకుని కాలి మీదుగా దాన్ని బరికే ప్రయత్నం చేశాడు. అది వెలిగేలోపులో ఇరవైసార్లయినా ప్రయత్నం చేసేవుంటాడు. వెలిగిన ఆ పుల్లని పళ్ళమధ్య యిరికించుకుని బెరడు దగ్గరకు తెచ్చాడు, కానీ ఆ మంటవాసన ముక్కుపుటాల్లోకి దూరి పొలమారడంతో అగ్గిపుల్ల మంచునేల మీద పడి టప్పున ఆరిపోయింది.

ఆ గంధకపు వాగు పెద్దాయన చెప్పింది రైటే. ఆ క్షణంలో అతడి నిరాశ నియంత్రణ కోల్పోయే సమయంలో వచ్చిన ఆలోచనది. మైనస్ 50ల్లో తోడుగా మనిషి లేకుండా ఎటూ పోకూడదు. మళ్ళీ చేతులు కొట్టుకొని చూసుకున్నా ఎలాంటి చలనం కనిపించడం లేదు. ఒక్కసారిగా రెండు చేతుల తొడుగుల్ని పళ్లతో లాగిపడేశాడు. అగ్గిపెట్టెని రెండు చేతుల మధ్యలో ఇరికించుకొనే ప్రయత్నం చేశాడు. పై చేతి కండరాల్లో సత్తువ ఇంకా మొద్దుబారకపోవడంతో వాటి బలంతో చేతుల్ని దగ్గరికి తెచ్చేందుకు శాయశక్తులా ప్రయత్నం

చేశాడు. ఇంక బలంగా వాటిని కాలిమీద రాపాడించడంతో ఒక్కసారిగా 70 అగ్గిపుల్లలు భగ్గుమన్నాయి!

వీచేగాలి లేకపోవడంతో మంట ఆరకుండా ఉంది. మంటకమురు మొహం మీదికి రాకుండా తప్పించుకోవడానికి తల అటు తిప్పుకున్నాడు. మంటని చెట్టు బెరడుకు అంటించే ప్రయత్నం చేశాడు. అలా పట్టుకునేటప్పటికి చేతుల్లో ఏదో చేతన మొదలైనట్టు గ్రహించాడు. అతని మాంసం తగలబడ్డ వాసనది. తనకి వాసన తగుల్తోంది. ఆ అనుభూతి నొప్పిలోకి దించింది. దాన్ని భరిస్తూనే వున్నాడు. చేతుల్లో పట్టుకున్న మంటని చెట్టు బెరడుకు అంటించాలని విశ్వప్రయత్నం చేస్తున్నా, బెరడు చటుక్కున అంటుకోనివ్వకుండా ఆ చేతులే మంటని ఎక్కువ అందుకుంటున్నాయి.

ఇంక చివరికి మంట తట్టుకోలేక చేతుల్ని వెనక్కి లాక్కున్నాడు. మండుతున్న ఆ అగ్గిపుల్లలకట్ట మంచునేల మీద పడిపోయింది, కానీ బెరడు మాత్రం రగులుకుంది. వెంటనే ఎండుగడ్డీ, చిదుగుపుల్లలు మంటమీద వేయడం మొదలుపెట్టాడు. ఏం వేస్తున్నాడో జాగ్రత్తగా చూడకుండానే చేతుల్లోకి వచ్చినవాటిని మంటలో వేస్తున్నాడు.

పుల్లలమీద పచ్చిగావున్న చిన్నచిన్న గడ్డిపరకలు ఉన్నాయి. వాటిని వీలయినంత మేరకు పళ్ళతో కొరికిపడేస్తున్నాడు. చాలా జాగ్రత్తగా మంటని కాపాడుకోవాలిప్పుడు. ఎందుకంటే అదే ఇప్పుడు బతుకు తనకి, అది ఆగిపోకూడదు.

చర్మాన్ని అంటుకు ప్రవహించే రక్తం దిగువకు వెళ్లిపోవడంతో చలికి ఆ మనిషి గజగజా వణుకుతున్నాడు. ఆ చిన్న మంట మీద ఒక తేమగా ఉన్న మొక్క తాలూకు పెద్దమండ ఒకటి పడిపోయింది. చేతివేళ్లతో దాన్నిపక్కకి నెట్టేద్దామని ప్రయత్నించాడు. వణుకుతున్న చేతుల్తో అలా దాన్ని తొలిగించేటప్పుడు ఆ తాకిడికి మంట చెదిరిపోయి విసిరేసినట్టు ఎడంగా పరచుకుంది. చెదిరిపోయిన మండుతున్న చిదుగుల్నీ, గడ్డినీ దగ్గరకి కూడగట్టే ప్రయత్నం చేశాడు. వణుకుతున్న ఆ చేతి వేళ్లతో ఎంత బలంగా ప్రయత్నం చేసినా అవి అతని మాట ఖాతరు చేయకపోవడంతో అవి దగ్గరికి పోగుపడనేలేదు. ప్రతి పుల్లా పొగవిడుస్తూ, ఆరిపోయింది. నిప్పు నిలబెట్టుకోవాల్సినోడు ఓడిపోయాడు. ఆ మనిషి తన్ని తాను చూసుకుంటున్నప్పుడు, అతని దృష్టి ఆరిపోయిన ఆ నిప్పు తాలూకు కుప్పమీద కూచున్న కుక్క మీద పడింది. అది చాలా అసహనంగా కదులుతుంది అటూ ఇటూ, ఒకసారి ఒక పాదం మరోసారి యింకో పాదం పైకెత్తుతూ.

ఆ కుక్క కదలికల్ని చూస్తోన్న ఆ మనిషి బుర్రలోకి ఒక క్రూరమైన ఆలోచన వచ్చింది. ఒకసారతనికి ఒక తుపానులో చిక్కుబడి, జంతువుని చంపి, దాని చర్మంలో దూరి బతికి

బయటబడ్డ ఓ వ్యక్తి తాలూకు కథ హఠాత్తుగా గుర్తుకొచ్చింది. తను కూడా కుక్కని చంపి, చేతుల్ని వేడెక్కించుకునేదాకా దాని శరీరపు వెచ్చదనంలో వుంచి అలా చెయ్యొచ్చునని ఆలోచన చేశాడు. అప్పుడు ఇంకోసారి నిప్పు రాజేసుకోవచ్చని తలపోశాడు.

కుక్కతో దాన్ని ఇలా రమ్మన్నట్టుగా పిలిచాడు. కానీ, అతని గొంతులో ధ్వనిస్తోన్న ఏదో వింతభయం తాలూకు గ్రహింపు దాన్ని భయపెట్టింది. అతనలాంటి గొంతుతో మాట్లాడటం దానికి గతంలో ఎప్పుడూ అనుభవంలో లేదు. ఏదో తేడాగా ఉందన్న విషయం గమనించి, ప్రమాదాన్ని పసికట్టింది. అదెలాంటి ప్రమాదమో తెలియదుగానీ, ఆ మనిషిపట్ల దాని మెదడులో భయం మాత్రం కలిగింది. ఆ మనిషి గొంతు వింటూనే అది చెవులు కిందకు జార్చి, మరింత అసహనంగా అటూ ఇటూ కదులుతూ కాళ్ళు పైకెత్తుతూ దించుతూ వుండిపోయింది. కానీ అది అతని దగ్గరకి మాత్రం రాలేదు. ఇంక ఆ మనిషి చేతుల మీదకు జారి, మోకాళ్ళ మీద కిందికి ఒంగి కుక్కవైపు కదిలాడు. ఈ రకమైన విచిత్రమైన కదలిక ఏనాడూ ఎరగని కుక్క మరింత భయ విహ్వలతతో వెనక్కి జరిగింది.

ఒకక్షణంపాటు మంచునేలమీద కూర్చున్న ఆ మనిషి తనని తాను సంభాళించు కోవడం కోసం యత్నించాడు. మళ్లీ చేతి తొడుగుల్ని పళ్ళతో ఎక్కించుకుని నేలమీద నిలదొక్కుకునే ప్రయత్నం చేశాడు. నిజంగానే తను నిలబడుతున్నానని రూఢిపరచుకోవ డానికా అన్నట్టు నుంచున్న చోటువైపు దృష్టి పెట్టాడు, ఎందుకంటే తన కాళ్ళు చలన రహితంగా మారి నేలతో అసలు సంబంధం లేనట్టుగా మారిపోయాయి. అతని స్థితి చూశాక కుక్కకి ఇప్పుడింక భయం పోయింది.

తన ఎప్పటి గొంతుకతో దాన్ని రమ్మని ఆజ్ఞాపించగానే అది అతని పిలుపుని ఔదల దాలుస్తూ చేరువకి వెళ్ళింది. అదెప్పుడైతే దగ్గరికి వచ్చిందో అతనికి తనమీద నియంత్రణ తప్పి సహనం కోల్పోయాడు. వెంటనే తన చేతులు బార్లా చాపి దాన్ని అమాంతం పట్టేసుకుందామని అనుకున్నా, తన చలనంలేని చేతులు తనకి సహకరించడం లేదన్న విషయం గ్రహించాడు. ఆ వేళ్ళు వంగుతున్నట్టు గానీ, కదులుతున్నట్టు గానీ అనిపించనే లేదు. అసలవి మొద్దుబారాయనీ, ఇంకా గడ్డకట్టుకుపోతున్నాయన్న విషయాన్ని ఆ క్షణంలో మరిచేపోయాడు. ఇదంతా ఎంత వేగంగా జరిగిపోయిందంటే అది తన నుంచి తప్పించుకునే లోపు దాన్ని రెండు చేతుల్తో చుట్టేసుకుని మంచులో కూలబడిపోయాడు. అది మొరుగుతూ విదిలించుకునే ప్రయత్నం చేస్తోంది.

ఇంక అంతకంటే చేయడానికి ఏమీలేనట్టు తన శరీరాన్ని దానికి చుట్టిపట్టి అలా

చేష్టలుడిగి కూచున్నాడు. దాన్ని చంపడం అసాధ్యమన్న విషయం అర్థమైంది. మార్గం కూడా ఏమీలేదు. గడ్డకట్టుకుపోయిన ఆ చలనంలేని చేతుల్తో కత్తి పట్టుకోలేనూ లేదు, దాంతో ఏమీ చేయలేనూ లేదు. కుక్క మెడచుట్టూ చేతుల్ని పట్టుకొని ఉంచలేడు కూడా. దాంతో అతడు పట్టు వదిలేశాడు. వెంటనే అది ఒక్క ఉదుటన దూసుకెళ్లి పరుగుతీసింది, ఇంకా గట్టిగా మొరుగుతూ. అది అక్కడ నుండి 40 అడుగుల కవతల ఆగి అతన్ని పరీక్షగా చూసింది, చెవులు ముందుకు రిక్కిస్తూ.

ఆ మనిషి తన చేతులవైపుకి ఒక్కసారి చూసుకున్నాడు ఎక్కడున్నాయో తెలుసుకుందామన్నట్టు, అవి నిర్జీవంగా దిగువకు వేలాడటం చూశాడు. చేతులెక్కడున్నాయో చూసుకోవడానికి తన కళ్లని ఉపయోగించుకోవడమన్నది వింతగా అనిపించిందతనకి. మళ్లీ తొడుగులు వేసివున్న చేతుల్ని ఇరువైపులా బాదుకుంటూ చేతులు ఊపడానికి ఉద్యుక్తుడయ్యాడు. ఐదు నిమిషాలపాటు అలా చేస్తూనే వున్నాడు. వణుకు తగ్గడానికి సరిపడా రక్తాన్ని అతని గుండె చేరవేసింది. అయినా చేతుల్లోకి మాత్రం చలనం రాలేదు.

ఒక్కసారిగా అతనిలో మృత్యు భయం దోబూచులాడింది. అతనికి అర్థమౌతోంది ఇదేదో మామూలుగా జరిగే చేతుల, కాళ్ళవేళ్ళు మొద్దుబారిపోవడం లాంటిదో, చేతులో, పాదాలో పోవడంలాంటిదో కాదని. ఇప్పుడా అననుకూల పరిస్థితుల్లో అదొక చావుబతుకుల సమస్యన్న విషయం అర్థమౌతోంది. భీతిల్లిన అతని గుండె నియంత్రణ కోల్పోయేలా చేసిందతనిని. దాంతో విహ్వలంగా ఆ వాగు తాలూకు పాత తోవవెంట పరుగు లంకించుకున్నాడు. కుక్క అతన్నే అనుసరిస్తూ పరుగుతీసింది. జీవితంలో ఏనాడూ ఎరగని ఒక గుడ్డి భయంతో ఆ మనిషి వెర్రిగా పరుగెడుతున్నాడు. ఆ మంచునేల మీద విశ్వ ప్రయత్నం చేస్తూ వెళుతోన్న అతనికి అప్పుడప్పుడే వాగు అంచులూ, బోసిగా ఉన్నచెట్లూ, ఆకాశమూ నెమ్మదిగా దృశ్యమానమౌతున్నాయి.

పరుగు అతని స్థితిని కొంచెం మెరుగుపరిచింది. ఇంక తను చలించదలుచుకోలేదు.

బహుశా తను మరింతసేపు ఇలానే పరుగెడితే, తన కాళ్ళు గడ్డకట్టుకోకుండా వుంటాయేమో అనుకున్నాడు. ఇంకా ఇలానే పరుగెడితే బహుశా తను క్యాంపుకు చేరి, పిల్లల్నీ చూసుకోవచ్చు అనుకున్నాడు. చేతి వేళ్ళు కొన్ని, కాలి వేళ్ళు కొన్ని, మొహంలో కొంతా కోల్పోవాల్సి ఉంటుందని అతనికి నిశ్చయంగా తెలుసు. కానీ తనక్కడకు చేరగానే మిగతా శరీరాన్నైనా పిల్లలు కాపాడతారన్న భరోసా ఉంది. అదే సమయంలో, తనసలు ఎప్పటికీ క్యాంపుకు చేరడమూ, పిల్లల్ని చూసుకోవడమూ జరుగుతుందా లేదా అన్న భీతీ కొట్టుమిట్టాడుతోంది. అది యెన్నో మైళ్ళకావల ఉందనీ, అంత దూరం పోవడమన్నది

అసాధ్యమనీ, ఆ భయంకరమైన గడ్డకట్టే చలిలో తనకు మృత్యువు తప్పదనీ లీలగా తెలుస్తోంది. ఆ ఆలోచనని బుర్రలోకి రానీయకుండా బలవంతంగా వెనక్కి తోసి ఇంక దాన్ని వెలికిరాకుండా అణిచిపెట్టాడు. అయినా ఏదోసారి అది ముందుకొచ్చి వేధిస్తూనే ఉంది. విశ్వప్రయత్నం మీద దాన్ని వెనక్కి తోస్తూ వేరే వాటిమీద మనసు లగ్నం అయ్యేలా ప్రయత్నం చేశాడు.

ఆశ్చర్యపడే విషయం ఏమంటే ఆ గడ్డకట్టిన, అచేతనమైన, నేలను తాకిన స్పర్శ కూడా కోల్పోయిన పాదాలమీద, తన శరీర భారాన్ని మోస్తూ అసలుతనెలా పరుగెడు తున్నాడో అర్థంకాకుండా ఉందతనికి. అసలతను నేలకు తాకకుండానే పైపైనే గాల్లో ఎగురుతూ పోతున్నాడేమోనన్నట్టుగా అనిపిస్తోంది.

క్యాంపుకు చేరేదాకా పరుగెత్తుకెళ్లడమూ, పిల్లల్ని కలవడమూ అన్న ఆలోచనలో మళ్ళీ ఓ సమస్య పట్టిపీడిస్తోంది; అదే, అతని స్థైర్యం దెబ్బతిందన్న నిజం. అనేకసార్లు తనకు తానుగా పడిపోతున్నట్టు గ్రహించాడు. ఇంక తన్నితాను నిభాయించుకోలేక చివరకు కుప్పకూలాడు. శక్తి కూడగట్టుకొని లేచే ప్రయత్నం చేసినా విఫలమయ్యాడు. తనిప్పుడు కాసేపు విశ్రాంతి తీసుకోవాలనుకున్నాడు. ఇంక తర్వాత తను నడుస్తూ వెళ్లిపోవచ్చు అనుకున్నాడు.

కూచుని, కొంచెం ఊపిరి తీసుకున్నాక, కొంచెం వెచ్చగా సౌకర్యంగా అనిపించడం మొదలుపెట్టింది. ఇప్పుడు వణుకు కూడా లేదు. పైగా ఒక వెచ్చని వెలుగేదో శరీరం లోకి చొరబడినట్టుగా తోచింది. అయినా కూడా, తను తన ముక్కునీ, మొహాన్నీ తడిమి చూసుకున్నప్పుడు ఎలాంటి స్పర్శ లేకపోవడం గమనించాడు. పరుగెత్తడం మూలంగా అవేమీ చలనం పుంజుకున్నట్టు తోచదు; చేతులూ, కాళ్ల పరిస్థితీ అంతే. ఇంకా తనకి ఏమనిపించిందంటే తన శరీరంలో బండబారిపోయిన ఆ భాగాలన్నీ పెరిగిపోతున్నట్టుగా తోచింది. అలాంటి ఆలోచన తలెత్తకుండా, పక్కనపెట్టే ప్రయత్నం చేసి మర్చిపోవా లనుకున్నాడు. ఎందుకంటే అలాంటి ఆలోచనలు తనని భయపెడతాయనీ, దాంతో తనకి భీతి కలగొచ్చేమో ననుకున్నాడు. కానీ ఆ ఆలోచన అతన్ని తిరిగి వెంటాడుతూ, వేధిస్తూనే వస్తోంది, అతని పూర్తి శరీరం బండబారిపోయిందని అతను గుర్తించే వరకూ. ఇది దుర్భరంగా ఉంది. మళ్లీ అతను లేచి ఆ వాగువెంటే పరుగెడుతున్నాడు పిచ్చిగా. కొంచెం పరుగు నెమ్మదించినప్పుడు, మరింతగా తన శరీరం బండబారిపోతున్నదన్న ఆలోచన అతన్ని మరింతగా పరుగుపెట్టమని చెబుతోంది.

అంతసేపూ కుక్క కూడా తనని వెన్నంటే పరుగుపెడుతూ వస్తూనే వుంది. రెండోసారి

అతను పడినప్పుడు, కుక్క దాని తోకని దాని కాళ్ళకి చుట్టి, అతని ఎదురుగా అతనివైపే ఆశ్చర్యంగా చూసుకుంటూ కూచుండిపోయింది. అది పొందుతున్న వెచ్చదనాన్ని, ఆ జంతువు అనుభవిస్తున్న ఆ భద్రతా భావాన్ని చూసి అతనికి కోపంగా ఉంది. అది చెవులు దించేంతవరకూ ఉడుక్కుంటూ శాపనార్థాలు పెట్టాడు. ఈసారి వణుకు మరింత వేగంగా చొరబడింది వంట్లోకి. ఈ భీకరమైన చలితో తన యుద్ధం ముగిసిపోబోతోంది. తన శరీరాన్ని అది అన్ని వైపులనుంచీ ఆక్రమించుకుంటోంది. దాంతో మరింత ముందుకు ఉరికాడు. అయినా 100 అడుగుల దూరం కూడా వెళ్లక ముందే తల నేలను తాకుతూ కుప్పకూలాడు.

ఇంకది తన చివరి క్షణపు భయం. ఎప్పుడైతే కొద్దిగా శరీరం మీద నియంత్రణ వచ్చి ఊపిరి అందుకుందో అదే క్షణంలో ఒక ఆలోచన చేశాడు. మృత్యువుని హుందాగా ఎదుర్కోవాలని కోరుకున్నాడు. అయినా కూడా, సరిగ్గా ఇదే రీతిలో తనకా ఆలోచన తట్టలేదు. తనకి ఏమనిపిస్తుందంటే అప్పటివరకూ తనొక మూర్ఖుడిలా ఆలోచిస్తూ వస్తున్నానని. తలతెగిపోయిన కోడిపిల్ల అక్కడక్కడే గింగిరాలు తిరిగినట్టు చుట్టూ పరుగెడుతున్నానని. ఇపుడున్న పరిస్థితుల్లో తను గడ్డకట్టుకుపోవడం ఖాయమన్న విషయం అర్థమై దాన్ని ప్రశాంతంగా స్వాగతించడానికే ఉద్యుక్తుడయ్యాడు. ఎప్పుడైతే ఈ కొత్తగా కనుక్కొన్న ప్రశాంత చిత్తత అతని ఆలోచనలో కొచ్చిందో వెనువెంటనే అతనికి ఒక నిద్ర లాంటి అవస్థ మొదలైంది. ఒక మంచి ఆలోచన, అతను అనుకున్నాడు, నిద్ర నుంచి శాశ్వత నిద్రలోకి వెళ్లిపోవడం. మనుషులనుకున్నట్టు గడ్డకట్టుకుపోవడమన్నది మరీ అంత చెడ్డదేమీకాదు. అనేకమైన దుర్భర చావులు చాలానే ఉన్నాయి.

అతని మదిలో ఆ మరురోజు తన దేహాన్ని పిల్లలు ఎలా చూస్తారో చిత్రించుకున్నాడు.

హఠాత్తుగా అతను వాళ్ళతో ఉన్నట్టుగా చూస్తున్నాడు. వాళ్ళవెంట ఆ వాగు తోవగుండా నడుస్తూ, తనని తానే వెతుక్కుంటూ. ఇంకా వాళ్ళతో వున్నాడు తను. ఒక మలుపు తిరిగిన తరువాత, అక్కడే పడివున్న తన దేహాన్ని ఆ మంచునేల మీద గుర్తిస్తాడు తను వాళ్ళతోపాటు. ఇప్పుడు తనకు తాను ఏమీకాదు. ఇప్పుడు తను తననుంచి వెళ్లి, వేరైపోయిన ఎవ్వరో తాను. అయినా తన బిడ్డలపక్క నిలబడి తననితనే చూసుకుంటున్నాడు. అవును చలి దుర్భరంగా వుందికదా అనుకున్నాడు.

తను అమెరికా తిరిగొచ్చాక అసలు చలి ఎలాంటిదో చెప్పి తీరాలిసిందే వాళ్ళకి.

అక్కడి నుండి అతని ఆలోచన ఆ గంధకపు వాగు ముసలాయనవైపు మళ్లింది.

అతన్నిప్పుడు స్ఫుటంగా చూస్తున్నాడు, చాలా వెచ్చగా, సౌకర్యంగా చక్కగా పైపు పీలుస్తూ.

“పెద్దాయనా, నువ్వు చెప్పిందే రైటు... నిజం నువ్వు చెప్పిందే రైటు” గంధకపు వాగు ముసలాయనతో హీన స్వరంలో గొణుగుతున్నా డతడిప్పుడు.

చూస్తుండగానే ఆ మనిషి వెళ్లిపోతున్నాడు. ఎక్కడా దొరకని, ఎప్పుడూ తెలియని ఒక అత్యంత సౌకర్యవంతమైన, సంతృప్తికరమైన నిద్రలోకి నెమ్మదిగా జారిపోతున్నాడు. కుక్క అతని ఎదురుగుండా కూచొని వేచిచూస్తోంది. ఒక సంక్షిప్త దినం ఒక అనంతమైన సాయంత్రంగా ముగిసిపోయింది. ఇంక నిప్పు రాజేయడం అనే ఆశావహస్థితి ఏమీ వుండదింక. ఓ వ్యక్తి అలా మంచునేలలో, నిప్పు రాజేసేపని లేకుండా కూచొని ఉండట మన్నది ఆ కుక్క అనుభవంలో ఎన్నడూ తారసిల్లలేదు. సాయంత్రపు పొద్దువాలి చీకటి చిక్కబడేకొద్దీ నిప్పుకోసం అది మరింతగా తపనపడుతోంది. పాదాలు మరింతగా ఎత్తివేస్తూ, అది మెల్లిగా ఏడవడం మొదలుపెట్టింది. ఆ మనిషి శాపనార్థాల్ని ఆశిస్తూ చెవులు వాల్చి ఎదురుచూస్తోంది. కానీ ఆ మనిషి చలన రహితంగా వున్నాడు. తర్వాత అది పెద్దగా మొరిగింది. ఆ తర్వాత అది ఆ మనిషి చేరువకు వచ్చి మృత్యువు తాలూకు వాసనని పసిగట్టింది. తటాల్న అది వెనక్కి జంకింది. అలా గట్టిగా అరుస్తూనే ఉంది చాలాసేపు. వెలుగులీనుతూ దుమికే నక్షత్రాలు నాట్యం చేస్తున్న ఆ చల్లని ఆకాశం కింద అక్కడే కాసేపు అటూ ఇటూ తచ్చాడింది. మరి కాసేపట్లో అది తనకి తెలిసిన తోవవెంట క్యాంపు వైపుకు పరుగుతీసింది, అక్కడ తనకింత ఆహారమూ, ఇంత వెచ్చదనమూ ఇచ్చే ఇతర మనుషుల్ని వెతుక్కుంటూ!